RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 260 శనివారం 19 - 04 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయున వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## జపాన్‌లో సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణకు పెట్టుబడులతో రావాల
- ఎదుగుతోన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామికవేత్తలు,వ్యాపారవేత్తలకు రేవంత్ రెడ్డి ఆహ్వానం
- తెలంగాణలో జపాన్ పెట్టుబడులకు తెలంగాణలో విస్తృత అవకాశాలు




తెలంగాణకు పెట్టుబడులతో రావాలని, చైనా ప్లస్ వన్ ప్రత్యామ్నాయంగా ఎదుగుతోన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. - మిగతా 2 లో

## నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

- ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ
- బీఆర్ఎస్ రజతోత్సవ సభలోమహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం,అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు



ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో మిగతా 2 లో

## దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన వీహెచ్‌పీ




- వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ బెంగాల్ లో హింసాత్మక ఘటనలు
- బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని వీహెచ్‌పీ డిమాండ్
- అన్ని రాష్ట్రాల్లోని వీహెచ్‌పీ సభ్యులు, మద్దతుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు

## కేంద్రంలో కీలక కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ?




- కేంద్రంలో కీలక పరిణామాల దిశగా సంకేతాలు.. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ?
- కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ, బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన కొత్త అధ్యక్షుడి ఎన్నిక పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం

## ఢిల్లీ పాలనకు తమిళనాడు లొంగదు



కేంద్ర ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విరుచుకుపడ్డారు. తమిళనాడులో 2026లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపైన స్పందిస్తూ, ఢిల్లీ పరిపాలనకు తమిళనాడు లొంగదన్నారు. ఆ ప్రత్యేకత తమిళనాడుకు ఉందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల తరహాలో పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఇక్కడ కుదరదని స్పష్టం చేశారు. 2026 ఎన్నికల్లో కూడా తమ పార్టీనే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఇప్పటికే భాషా వివాదం నేపథ్యంలో ఆ - మిగతా 2 లో

- కేంద్రంపై స్టాలిన్ ఫైర్
- 2026 ఎన్నికల్లో కూడా తమ పార్టీనే గెలుస్తుందని ధీమా
- అమిత్ షాకు పలు ప్రశ్నలు సంధించిన స్టాలిన్
- పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఇక్కడ కుదరదు
- ఇప్పటికే భాషా వివాదం నేపథ్యంలో ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశాం

## 'స్వచ్ఛ ఆంధ్ర' ఏప్రిల్ నెల థీమ్

- 'స్వచ్ఛ ఆంధ్ర' ఏప్రిల్ నెల థీమ్ ను వెల్లడించిన సీఎం చంద్రబాబు
- ప్రతి నెల 3వ శనివారం ఏపీలో స్వచ్ఛ ఆంధ్ర
- ఒక్కో నెల ఒక్కో థీమ్
- ఈసారి 'ఈ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం' థీమ్



ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. ప్రతి నెల 3వ శనివారం రోజున రాష్ట్రవ్యాప్తంగా 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందుకోసం వివిధ థీమ్ లను అనుసరిస్తున్నారు. ఏప్రిల్ నెల థీమ్ ను తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. "స్వర్ణాంధ్ర-2047 సంకల్పంలో భాగంగా 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం నాడు జరుపుకుంటున్నాం. ప్రతి కార్యక్రమం స్ఫూర్తివంతంగా ఉండేందుకు నెల నెలా ఒక్కో థీమ్ ను ఎంచుకుని నిర్వహిస్తున్నాం. ఈసారి 'ఈ-వ్యర్థాల సేకరణ, - మిగతా 2 లో

## వాళ్ల కోసం స్వయంగా రంగంలోకి పవన్ కల్యాణ్

- భూ బాధితుల కోసం స్వయంగా రంగంలోకి
- ప్రజలను ఇబ్బందిపెడితే కూటమినేతలనూ ఉపేక్షించం
- రాష్ట్రం నలుమూలల నుంచి భూ కబ్జాలకు సంబంధించిన సమస్యలు
- అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు



జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. భూ బాధితుల కోసం స్వయంగా రంగంలోకి దిగనున్నారు. అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను జిల్లాల పర్యటన చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూదందాల - మిగతా 2 లో




## బెట్టింగ్ యాప్ లపై కొరడా

- కొత్త యాంటీ పాలసీకి లోకేష్ హామీ
- ప్రముఖులు చేసే ప్రచారాన్ని నమ్మి ఎంతోమంది యువత బెట్టింగ్ బారిన
- అడ్డుకట్ట వేసేందుకు ఏపీలో కొత్త పాలసీ

## మొదటిపేజీ తరువాయి

# 'స్వచ్ఛ ఆంధ్ర' ఏప్రిల్ నెల థీమ్



వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం' థీమ్ ను ఎంచుకోవడం జరిగింది. ఎందుకంటే చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యం అవుతుంది. ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎన్జీఓలు, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరుతున్నాను. ఎక్కడికక్కడ ఇ-వేస్ట్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయండి. వీటి నిర్వహణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జి సభ్యులను గుర్తించి.. వారి సేవలను వినియోగించుకోండి. 'రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్" అనేది ఈ - వేస్ట్ కలెక్షన్ సెంటర్ల నినాదం కావాలి. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసి తద్వారా స్వర్ణాంధ్ర సంకల్పాన్ని మరింత ముందుకు వెళ్లే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నాను" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# రేపు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన వీహెచ్‌పీ



రేపు దేశ వ్యాప్త సమ్మెకు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) పిలుపునిచ్చింది. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ లోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు చెలరేగిన సంగతి తెలిసిందే. ముర్షిదాబాద్ అల్లర్లలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. ఈ హింసాత్మక ఘటనలను వీహెచ్‌పీ ఖండించింది. బెంగాల్ లో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది.బెంగాల్ హింసాత్మక ఘటనలకు వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ మేరకు వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని జిల్లాల్లోని వీహెచ్‌పీ సభ్యులు, మద్దతుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. బెంగాల్ లో ఎమర్జెన్సీ విధించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లకు మెమోరాండం సమర్పించాలని చెప్పారు.

# నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం



వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# టోక్యోలో సుమిధా నదిలో పడవలో ప్రయాణించిన రేవంత్ రెడ్డి

**సుమిధా నది తీర ప్రాంత అభివృద్ధిని పరిశీలించిన బృందం**

**టోక్యో మాదిరి మూసీ తీరాన్ని తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో అధ్యయనం**

**తెలంగాణకు మరో రూ.10,500 కోట్ల పెట్టుబడులు**



జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బృందం టోక్యో నగరంలోని సుమిధా నదిలో పడవ ప్రయాణం చేశారు. నదీ తీర ప్రాంత అభివృద్ధిని పరిశీలించారు. టోక్యోలోని ఈ నది తరహాలోనే మూసీ నదీ తీరాన్ని ఆధునికీకరించాలనే లక్ష్యంతో అధ్యయనం సాగించారు.ఇదిలా ఉండగా, అంతకుముందు ఎన్టీటీ డేటా, నెయిసా నెట్ వర్క్స్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సమావేశమైంది. తెలంగాణలో రూ. 10,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీటీ డేటా, నెయిసా నెట్ వర్క్స్ సంస్థలు సుముఖత వ్యక్తం చేశాయి. హైదరాబాద్ నగరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నాయి.

# ఢిల్లీ పాలనకు తమిళనాడు లొంగదు

**మొదటిపేజీ తరువాయి**



చేశారు.ఇప్పటికే భాషా వివాదం నేపథ్యంలో ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇస్తామని, త్రిభాషా సూత్రాన్ని అమలు చేయబోమని అమిత్ షా హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనతో (పార్లమెంటరీ ఎన్నికల్లో) సీట్లను తగ్గించమని చెప్పగలరా స్టాలిన్ అని నిలదీశారు. ఇటీవల కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ప్రజలను కించపరిచేలా మాట్లాడారని, అమిత్‌షా సైతం అదే విధమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారమే కేంద్రం, రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని, ఎవరూ ఎవరికి సబార్డినేట్ కాదని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు.కాగా జాతీయ విద్యలో త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్ మొదలైన విషయాలపై తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో తీవ్రంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై విస్తృతంగా పోరాటం చేస్తోంది స్టాలిన్ ప్రభుత్వం. దీని కోసం ఇటీవల ఆయన ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తుందని చెప్పారు. రాష్ట్రాల చట్టబద్ధ హక్కులను పరిరక్షించడంతోపాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కమిటీని ఏర్పాటు చేశామని స్టాలిన్ వివరించారు. మరోవైపు వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో అన్నాడీఎంకే కలిసి పోటీ చేయనుంది. ఈ క్రమంలోనే మాట్లాడిన అమిత్ షా, 2026లో తమిళనాట అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# జపాన్‌లో సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షో..



**మొదటిపేజీ తరువాయి**

టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో "భారత్ - జపాన్ దేశాల మధ్య సంబంధాలు : తెలంగాణపై ఫోకస్ : జపాన్ పెట్టుబడులకు తెలంగాణలో ఉన్న విస్తృత అవకాశాలు" అన్న అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి కీలక ప్రసంగం చేశారు.రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనేక అవకాశాలను సమగ్రంగా వివరించారు. వివిధ రంగాలకు చెందిన 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి గారు జపాన్ వ్యాపారవేత్తలను సాదరంగా ఆహ్వానించారు. భారతదేశంలోనే అతిపిన్న రాష్ట్రమైన తెలంగాణ, వేగంగా అభివృద్ధి చెందుతూ మీకు హృదయ పూర్వక స్వాగతం పలుకుతోంది. జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ..ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోంది అని ఉద్ఘాటించారు.టోక్యో చాలా గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజల సౌమ్యత, మర్యాద, క్రమశిక్షణ నన్ను ఎంతగానో ఆకర్షించాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నాం అని పేర్కొన్నారు. ఈ వేదికపై తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీ 'ఫ్యూచర్ సిటీ' మరియు మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ప్రచార వీడియోలను ప్రదర్శించారు. రోడ్‌షో అనంతరం, తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లోని పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించింది, భవిష్యత్ సహకార అవకాశాలను చర్చించింది.

# వాళ్ల కోసం స్వయంగా రంగంలోకి పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి**



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తానని తెలిపారు. అంతేకాదు ఫిర్యాదులను తానే స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. కూటమి పాలన పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగుతోందన్నారు. ప్రజలను ఇబ్బందిపెడితే కూటమినేతలనూ ఉపేక్షించనని పవన్ కల్యాణ్ హెచ్చరించారు.కాగా రాష్ట్ర రాజకీయాల్లో పవన్ కల్యాణ్ తనదైన ముద్ర వేస్తున్నారు. సవర్ధవంతంగా ప్రజలకు సేవ చేస్తున్నారు. రాజకీయాలకంటే ప్రజా సేవకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజల నుంచి తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నారు. మంగళగిరి జనసేన కార్యాలయం వేదికగా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ తక్షణమే పరిష్కారం చూపుతున్నారు. అయితే ఇటీవల కాలంలో భూ కబ్జాలకు సంబంధించిన సమస్యలు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్నాయి. దీంతో ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. బాధితులు వచ్చి కలిస్తేనే ఇప్పటి వరకు అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇక నుంచి భూ సమస్యలపై స్వయంగా తానే జిల్లాలకు వెళ్లి అర్జీలు స్వీకరించేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నారు. అలాగే కబ్జాలకు పాల్పడిన ఎవరినైనా సరే శిక్షించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని తాజాగా అధికారులతో జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో స్పష్టం చేశారు. భూ బాధితులకు జరిగిన అన్యాయాలపై తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# బెట్టింగ్ యాప్ లపై కొరడా

**మొదటిపేజీ తరువాయి**



ఏపీలో త్వరలోనే మరో కొత్త పాలసీ రాబోతోంది. యాంటీ బెట్టింగ్ పాలసీ తీసుకురానున్నట్లు మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. బెట్టింగ్ యాప్ లను ప్రోత్సహిస్తూ ప్రముఖులు చేసే ప్రచారాన్ని నమ్మి ఎంతోమంది యువత బెట్టింగ్ బారిన పడుతోంది.ఫలితంగా బెట్టింగ్ లో సొమ్మును అంతా ధారబోసి ఎంతోమంది ఆత్మహత్య చేసుకున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఏపీలో కొత్త పాలసీ తీసుకురానుంది ఏపీ ప్రభుత్వం.ఇటీవల బెట్టింగ్ బెట్టింగ్ యాప్ లపై యూట్యూబర్ నా అన్వేష్ యుద్ధం ప్రకటించారు. బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. తెలంగాణలో బెట్టింగ్ యాప్ లపై అన్వేష్ చేసిన పోరాటానికి ప్రభుత్వం స్పందించి.. వీటిని అరికట్టేందుకు చర్యలు చేపడుతామని పేర్కొంది. హైదరాబాద్ పోలీసులు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిపై కొరడా ఝుళిపించారు. తాము స్కిల్ గేమ్స్ యాప్‌లను మాత్రమే ప్రమోట్ చేశామని వాటికి సుప్రీంకోర్టు అనుమతి ఉందని ప్రకటించారు.కొంతమందిని విచారణకు పిలిచిన పోలీసులు తర్వాత ఈ కేసును సిట్ కు బదిలీ చేశారు.ఈ నేపథ్యంలోనే గోవిందా పేరుతో ఓ బెట్టింగ్ యాప్ ఉందని, దానికి తమన్నాతోపాటు చాలా మంది ప్రముఖులు అన్ని రకాల సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ప్రచారం చేస్తున్నారని లోకేష్ , పవన్ కళ్యాణ్ కోరుతూ అన్వేష్ ఓ వీడియో చేశారు. దీనిపై లోకేష్ వెంటనే స్పందించారు. ఈ బెట్టింగ్ యాప్ లపై చర్యలు తీసుకుంటామని, రాష్ట్రంలో బెట్టింగ్ నిరోధక పాలసీని తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

# కేంద్రంలో కీలక కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ?

**మొదటిపేజీ తరువాయి**



ఢిల్లీ రాజకీయాలు అసక్తి రేకెత్తిస్తున్నాయి. అతి త్వరలోనే కేంద్రంలో కీలక పరిణామాల ఉండబోతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. చట్టాల ఆమోదం విషయంలో రాష్ట్రపతికి సుప్రీంకోర్టు కాల పరిమితి విధించిన అంశంతో పాటు కేంద్ర కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ, బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన, భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక, పార్టీలో సంస్థాగత మార్పులు సహా పలు కీలక అంశాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వీటికి తోడు కేబినెట్ భేటీ జరగకపోవడం, ప్రధానిని రాష్ట్రపతిని కలవడం, బీజేపీ, కేంద్ర ప్రభుత్వ ముఖ్యుల వరుస సమావేశాల నేపథ్యంలో ఏదో జరగబోతుంది అంటూ రాజకీయంగా పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఊహాగానాలకు మరింత ఊతమిచ్చేలా గత కేబినెట్ జరగకపోగా వచ్చేవారం కూడా కేంద్ర కేబినెట్ భేటీ సమావేశం జరగడం లేదని తెలుస్తోంది. కేంద్రంలోని బీజేపీ అగ్ర నేతలు ప్రధానమంత్రి నరంద మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, బిఎల్ సంతోష్ ఉమ్మడిగా విడివిడిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.గత మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు ప్రధాని మోదీ. ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎన్నిక, సంస్థాగతంగా పార్టీలో మార్పులపై దృష్టి సారించిన అధిష్టానం కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై కూడా ఆలోచన చేస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతుంది. కేబినెట్, పార్టీ వ్యవస్థాగత పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొందరు యువ నేతలకు కీలక బాధ్యతలు అప్పజెప్పవచ్చంటూ బీజేపీ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. రానున్న బీహార్, పశ్చమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆయా రాష్ట్రాల నేతలకు కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశం వుందని భావిస్తున్నారు. ఇంతకాలం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన అన్నామలైను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారని ఇప్పటికే విస్తృతంగా ప్రచారం జరుగుతుంది.బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా వచ్చే వారం నూతన బీజేపీ జాతీయ అధ్యక్ష ప్రకటన ఉండే అవకాశం ఉంది. ఇప్పటివరకు 14 రాష్ట్రాలకు బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుల ప్రకటన పూర్తయింది. జాతీయ అధ్యక్షుడి ఎంపికకు ముందే కనీసం మరో ఐదు లేదా ఆరు రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ అధ్యక్షులను నియమించాల్సిన రాష్ట్రాల్లో మధ్య ప్రదేశ్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా సహా పలు రాష్ట్రాలున్నాయి. పార్టీ బలోపేతంలో భాగంగా బీజేప జాతీయ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.మరోవైపు పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ లో హింస కారణంగా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన దిశగా కేంద్రం అడుగులు అవకాశం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది..దీనితో పాటు రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించి, పంపించిన బిల్లులు విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపే విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తదుపరి ఏ విధంగా ముందుకు వెళ్ళాలన్న దానిపైనా కేంద్ర ప్రభుత్వ, బీజేపీ ముఖ్యులు చర్చిస్తున్నట్లు సమాచారం.!

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 19 - 04 - 2025

# కాంగ్రెస్ అంటేనే స్కాముల పార్టీ : బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె. రామకృష్ణ

### కాంగ్రెస్ నాయకులకు పిచ్చి కుక్క కర్చినట్లుంది.

**కంటోన్మెంట్ తెలంగాణ సేన న్యూస్ 18 :** కాంగ్రెస్ పార్టీ చేసిన స్కాములు రోజుకు ఒక్కటి చొప్పున బయటకు వస్తుంటే కాంగ్రెస్ నాయకులకు మతి భ్రమించి పిచ్చి కుక్క కర్చినట్లు మాట్లాడుతున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంటోన్మెంట్ మాజీ బోర్డు సభ్యుడు జన్యావుల రామకృష్ణ అన్నారు. శుక్రవారం జేబీఎస్ చౌరస్తా, పికెట్ చౌరాస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరికి నిరసనగా బిజెపి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి, కాంగ్రెస్ పార్టీ నాయకుల దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ చేసిన అనుచిత వాక్యాలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ అంజన్ కుమార్ గారిని పట్టించుకోవడం లేదని, సికింద్రాబాద్ ప్రజలు ఆయన్ని మర్చిపోయారనే ఫ్రస్టేషన్ లో పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని



కాంగ్రెస్ నాయకులు వెంటనే ఆయన్ని ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్ లో జాయిన్ చేయాలని ఎద్దేవా చేశారు. అలాగే భారత దేశంలో ఉండి, ఈ దేశం తిండి తింటూ ఈ దేశం గాలి పిలుస్తూ పాకిస్తాన్ దేశాన్ని ప్రేమించే అద్దంకి దయాకర్ భారత ప్రధానిపై అమర్యాదగా, ఏక వచనంతో సంబోధిస్తూ వారి గౌరవాన్ని కించపరిచారని అన్నారు. వెంటనే యావత్ దేశానికి ఆయన క్షమాపనలు చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు అద్దంకి దయాకర్ అనే వ్యక్తి మంత్రి పదవి కోసం దేశ ప్రధానిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ దేశంలో ఉగ్రవాదు లను, దేశ ద్రోహులను కాపాడుతూ వారికి మద్దతు ఇస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని ధ్వజమెత్తారు. నేషనల్ హెరాల్డ్ కేసు అనేది కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో ఉండి... ప్రధాని గా మన్మోహన్ సింగ్ ఉన్నపుడే నమోదు అయ్యిందని వారి ప్రభుత్వంలో నమోదైన కేసు విచారణ జరుగుతూ అన్ని సాక్ష్యాలతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై %జుణ% ఛార్జీ షీట్ దాఖలు చేసిందని అన్నారు. దానికి వ్యతిరేకంగా ఏవైనా సాక్ష్యాలు ఉంటే కోర్టులో చూసుకోవాలి కానీ రోడ్లపై ధర్నా చేస్తూ దొంగే ఇంకొకరిని దొంగా దొంగ అంటూ అరవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సతీష్, టోపీ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుక మల్లికార్జున్, జిల్లా స్పోక్స్ పర్సన్ బీఎన్ శ్రీనివాస్, కాంటెస్టెడ్ ఎమ్మె ల్యే వంశ తిలక్, వార్డు నూతన అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# బస్తర్ బచావో - భారత్ బచావో

### కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వలు కాల్పుల విరమణ పాటించాలి

**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** ఆదివాసీలను కాపాడటం రాజకీయ పార్టీల, పౌర సమాజాల బాధ్యత. భారత్ బచావో సభలో మేధావుల, రాజకీయ నాయకుల పిలుపు బస్తర్ లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరియు మావోయిస్ట్ పార్టీల మధ్య కాల్పుల విరమణ జరగాలని హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో భారత్ బచావో ఆధ్వర్యంలో కాల్పుల విరమణ కి మద్దతుగా సభ నిర్వహించడం జరిగింది. సభలో వక్తలు మాట్లాడుతూ ప్రొఫెసర్ హరగోపాల్ కేంద్ర ప్రభుత్వం , మావోయిస్ట్ పార్టీ మధ్య జరుగుతున్న యుద్ధం లో నక్సల్స్ పేరు మీద ప్రాణాలు కోల్పోతుంది ఆదివాసీలే అని అన్నారు. బస్తర్ లో ప్రజలు అమాయక వాతావరణంలో బ్రతుకుతున్నారని రాజ్యాంగంలో ఆదివాసిలకు పొందుపర్చిన షెడ్యూల్ 5, 6 లను ప్రభుత్వాలు కఠినంగా అమలు పరచాలని అన్నారు. మేధావుల సమక్షంలో ఏర్పడ్డ ప్లానింగ్ కమిటీ రిపోర్ట్ ని సమీక్షచాలని, ఆదివాసిల పట్ల మానవీయంగా వ్యవయహరించాలని మావోయిస్ట్ పార్టీ తో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి బస్తర్ లో కాల్పుల విరమణ జరపాలని అన్నారు. ఆదివాసీ నాయకురాలు సోనీ సోరి బస్తర్ లో ప్రభుత్వాల మధ్య మావోయిస్ట్ పార్టీ ల మధ్య జరుగుతున్న యుద్ధం లో ఎక్కువగా నష్టపోతుంధి ఆదివాసిలే బస్తర్ లో సల్వా జుడుమ్, మరియు ఇతర పేరుల మిధ్య అధివశీల మిధ విపరీతమైన హింస జరుతుంధి. నక్సల్స్ పేరు మిధ్య ఆదివాసిలను చంపుతున్నారు.. ఆధివాసీలను అరెస్ట్ చేసి జైల్లో పెట్టి చంపేస్తున్నారు.. న్యాయ వ్యవస్థలు ఆధివాసిల పట్ల కపట ప్రేమను చూపిస్తున్నాయి. ఒకవేల ఈ సమయంలో శాంతి చర్చలు జరగకపోతే బస్తర్, ఆధివాసిలు రెండు మిగలవు బస్తర్ లో ఎక్కడ చూసిన పోలీస్ క్యాంపులే ఉన్నాయి.. మణిపూర్ లాంటివ్ ఘటనలు



బస్తర్లో ప్రతిరోజూ జరుగుతున్నాయి. గ్రామసభ లాంటి మిగిలిన అధికారాలు అన్ని ఆదివాసీల చేతుల్లోకి ఇవ్వాలి. అప్పుడే రాజ్యాంగంలో పొందుపరచిన 5 వ షెడ్యూలు కు నిజమైన రాజ్యాంగ హోదా ఇచ్చినట్టు. బస్తర్ ని కాపాడటం అంటే బారతదేశాన్ని కాపడినట్టే బస్తర్ ని కాపాడాలని ఈ వేధిక నుండి ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్న కోదండురాం మాటాల్డుతూ రాజ్యాంగ పరధిలోనే ప్రభుత్వాలు పని చేయాలి. ఒకవేళ ఆ పరిధి దాటితే ప్రభుత్వాలకే హానికరం. మావోయిస్టు పార్టీ పిలుపినచ్చిన చర్చాలను నేను ఆహ్వానిస్తున్నాను. హింస అనేది ప్రజలను చంపేస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు కూడా చర్చలకు రావాలి. ఎనకౌంటర్ లలో మావోయిస్టు కార్యకర్తలు ముగ్గురు చనిపోతే మిగతా వారంతా సాధారణ ఆదివాసులే. చర్చలను రెండు వర్గాలు ముందుకు తీసుకుపోవాలి. ఈ కార్యక్రమంలో సోనీ సోరీ, ఆదివాసీ హక్కుల నాయకురాలు , భక్తచరణ్‌దాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏఐసిసి , బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ చైర్మన్, తెలంగాణ ప్లానింగ్ కమిషన్ , మధుయాష్కి, మాజీ ఎంపి., కాంగ్రెస్ , ప్రొ. కోదండరాం, ఎమ్మెల్సీ, అధ్యక్షులు, తెలంగాణ జనసమితి , అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ, కాంగ్రెస్ , డా. ఎస్.ఏ. సంపత్‌కుమార్, ఏఐసిసి సెక్రటరీ, ఛత్తీస్‌ఘడ్ ఇంచార్జి , జె.వి. చలపతిరావు, అధికార ప్రతినిధి, సి.పి.ఐ.(ఎం.ఎల్) న్యూడెమాక్రసి , కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి, సి.పి.ఐ. , జాన్ వెస్లీ, సిపిఎం - తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి , దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ, బి.ఆర్.ఎస్. , బేలా భాటియా, మానవహక్కుల కార్యకర్త , ప్రొ. హరగోపాల్, ప్రముఖ విద్యావేత్త , విమలక్క, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య , జస్టిస్ చంద్రకుమార్, అధ్యక్షులు, పీస్ డైలాగ్ కమిటీ , అల్లం నారాయణ, మాజీ చైర్మన్, తెలంగాణ ప్రెస్ అకాడమీ, కే. శ్రీనివాస్, ప్రముఖ పాత్రికేయులు , దేవీ ప్రసాద్, మాజీ అధ్యక్షులు, టి.ఎన్.జి.వో. , ప్రొ. కే.సీతారామరావు, మాజీ వి.సి., అంబేద్కర్ యూనివర్సిటి , ప్రొ. అన్వర్‌ఖాన్, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటి , బెల్లయ్య నాయక్, చైర్మన్, తెలంగాణ ట్రైబల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ , ఎం.డి. రియాజ్, చైర్మన్, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ కమిటి, స్కై బాబ, ముస్లిం థింకర్స్ ఫోరం, జంగా రాఘవరెడ్డి, చైర్మన్, తెలంగాణ రాష్ట్ర సహకార నూనె గింజలు %ఉ% పెంపకందారుల సమాఖ్య, సుంకెట అన్వేష్ రెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ , ఒబేదుల్ల కొత్వాల్. తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, పల్లె రవి గౌడ్, మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ , సోయం చిన్నన్న, గోండ్వానా ఆదివాసీ హక్కుల పోరాట సమితి, అధ్యక్షుడు, క్రాంతి చైతన్య, సిడిఆర్ఓ సౌత్ ఇండియా ఇంచార్జ్ , అంబటి నాగయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొన్నారు.

# నిర్మల్ లో స్టీరింగ్ లేని కారు..?

### నాయకత్వ లోపమే నిర్మల్ కారుకు కష్టాల..!

### బిఆర్ఎస్ నిర్మల్ అధ్యక్షురాలుగా పడకండి రమాదేవి..?

### ఆగమవుతున్న నాయకులు కార్యకర్తలు..!!

**నిర్మల్: ఏప్రిల్18:తెలంగాణ సేన న్యూస్ (స్టాఫ్ రిపోర్టర్ విజయ్ కుమార్) :** రెండు పర్యాయాలు అధికార పగ్గాలు చేపట్టి రాష్ట్రాన్ని పరిపాలించిన గులాబీ పార్టీలో ఇకముందు మనగడ ఉంటుందా..? బిఆర్ఎస్ కు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పార్టీని ఇకనైనా పట్టించుకుంటారా..? నాయకత్వ లోపంతో కార్యకర్తలను పట్టించుకున్న నాధుడు లేడని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.సరైన నాయకత్వం లేకపోవడం పట్ల బిఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉన్నప్పటికీ వారికి పలకరించేవారు లేరని ఇతర పార్టీకి వెళ్లలేక కారు వైపు తిరిగి రాలేక అయోమయంలో బిఆర్ఎస్ పార్టీ క్యాడర్. ఈనెల 27న జరగనున్న కెసిఆర్ సభ ఎంతమంది బయలుదేరుతున్నారో స్పష్టత లేకపోవడం... నిర్మల్ నియోజవర్గంలో కాంగ్రెస్, బిజెపి క్యాడర్ను ఉత్సవం నింపేందుకు కమిటీలు వేస్తూ పార్టీ పదవులను అలంకరిస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడిని నియమించ లేని స్థితిలో ఉంది.ఉన్న కేడర్ కూడా కార్యకర్తలు పట్టించుకోవడమే టిఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం కోల్పోతుందని అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ ఉనికి చాటుకునేందుకు సభను సక్సెస్ చేయాలని బిఆర్ఎస్ పార్టీ అధినేత చూస్తుంటే నిర్మల్ జిల్లా మాత్రం పూర్తిగా దానికి భిన్నంగా ఉంది. జూన్, జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు తరుముకొస్తున్న వేళ ఇప్పటికైనా నేతలు మేలుకొంటారా..? పార్టీ కి నిర్మల్ జిల్లాలో పుర్వవైభవాన్ని తిరిగి తెస్తారా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో రెండుసార్లు మంత్రి గా పనిచేసిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో పాటు నాయకులు కార్యకర్తలు కూడా కాంగ్రెస్ పార్టీ లో చేరడంతో పరిస్థితి మరింత క్షీణించింది. జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విట్టల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రేఖ శ్యాం నాయక్ పార్టీ మారడంతో బిఆర్ఎస్ పార్టీకి కోల్కోలేని దెబ్బ తగిలింది. జిల్లా జడ్పీ చైర్మన్ భర్త రాం కిషన్ రెడ్డి పార్టీని గాడిలో పెట్టగలరా..? అనేది



అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్యాడర్ ను కాపాడుకునేందుకు ఇంతవరకు కార్యకర్తలతో సమావేశాలు పెట్టిన, మనోధైర్యాన్ని ఇచ్చిన సందర్భాలు లేవు. స్థానిక సంస్థలలో పార్టీని గెలిపించగల శక్తి సామర్థ్యం ఉందంటారా..? ఇప్పటి పరిస్థితులలో బిఆర్ఎస్ పార్టీకి జిల్లాలో కష్ట కాలం ఎదురైందని చెప్పాలి. బలమైన నాయకత్వం లేకపోవడం కార్యకర్తలకు స్థానిక సంస్థలలో ప్రచారం చేసి గెలిపించుకునే కరిష్మా గల నాయకుడు లేకపోవడం, పట్ల జిల్లాలో సరైన నిర్దేశకులు లేక గులాబీ దళం చిన్నబోతుంది. కాంగ్రెస్, బిజెపి పార్టీలను ఢీకొట్టే విధంగా వారికి దీటుగా ఎదిరించే బలమైన నేతలు లేకపోవడం నిర్మల్ లో 15 రోజుల నుండి మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్న కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం పై నోరు మెదపకపోవడం, అధికారంలో ఉన్న బిజెపి ఎమ్మెల్యే పై మాట్లాడకపోవడం పట్ల కార్యకర్తలలో కూడా నిరాశ వ్యక్తం అవుతుంది. రాష్ట్రంలో కేటీఆర్ హరీష్ రావు బలమైన యుద్ధం చేస్తున్నప్పటికీ జిల్లాలో అలాంటి పరిస్థితి లేకపోవడం బిఆర్ఎస్ పార్టీ ప్రయాణం అగమ్యగోచరంగా మారిందన్న అభిప్రాయం రాజకీయ వర్గాలలో వ్యక్తం అవుతుంది. మరోవైపు గ్రామపంచాయతీ ఎన్నికలలో పార్టీ మద్దతుదారులను గెలిపించుకునేందుకు కాంగ్రెస్, బిజెపి పార్టీ గట్టి కసరత్తు చేస్తుంది. నాయకత్వ లోపంతో గులాబీ పార్టీ క్యాడర్ ను కోల్పోయే పరిస్థితి తెచ్చుకుంటుంది అని ప్రచారం కూడా లేకపోలేదు. గులాబీ పార్టీకి ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడిన సందర్భాలు లేవు. మూడు నియోజకవర్గాలలో కంచుకోటగా ఉన్న గులాబీ పార్టీకి కార్యకర్తలు కూడా కరువైన పరిస్థితి ఏర్పడింది. 10 సంవత్సరాలు కంచుకోటగా ఉన్న నిర్మల్ జిల్లా ఇప్పుడు అంచుకు కూడా రాని పరిస్థితి ఏర్పడుతుందా..? స్థానిక సంస్థల ఎన్నికలలో తేలిపోనుందా..? ఎవరి కేడర్ కు ఎంత బలం ఉందో.. తేలిపోనుందా..? అధికార పార్టీపై ప్రశ్నించే నాయకుడు కరువు కావడంతో జిల్లాలో గులాబి ఉనికి కోల్పోతుంది. ఒకరిద్దరు నాయకులు జిల్లాలో ఉన్నప్పటికీ వారు బిజినెస్, ఉన్న ఆస్తులను కాపాడుకునేందుకు ఇటు బిజెపి అటు కాంగ్రెస్ పై ఎలాంటి విమర్శలు చేస్తాలేరనే విమర్శలు కూడా లేకపోలేదు.గత ఎన్నికలలో డిపాజిట్లు కోల్పోవడం వల్ల రాష్ట్రంలో బలమైన నాయకుడిగా పేరు ఉన్న నాయకులు పార్టీ మారడంతో కార్యకర్తలను నాయకులను పట్టించుకొని, మంచి చెడులకు హాజరై కార్యకర్తలకు మనోధైర్యం ఇచ్చే నాయకత్వం లేకపోవడం, స్థానిక ఎన్నికలలో గెలుపు కష్టంగానే కనిపిస్తుంది. ఒక కాంగ్రెస్ పై వ్యతిరేకత తిరుగుతున్న నేపథ్యంలో పుంజుకోవాల్సిన బిఆర్ఎస్ పార్టీ నియోజవర్గంలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ఇలా అయితే రాబోయే రోజులలో జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ గల్లంతేనా..? ఈ విషయం గురించి గులాబీ కార్యకర్తలు నాయకులే చర్చించుకుంటున్నారు. జిల్లాలో గులాబీ పార్టీ పుంజుకుంటుందా లేదా అనేది స్థానిక సంస్థల ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే.

**బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలుగా రమాదేవి...?**

27న బిఆర్ఎస్ ఆవిర్భావ సభ అయిన తర్వాత నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షురాలుగా పలకంటి రమాదేవి నియమించినట్లు తెలుస్తుంది. గతంలో బిజెపి పార్టీ అధ్యక్షురాలుగా చేసిన అనుభవంతో పాటు మూడు నియోజకవర్గాలలో ఆమెకి ఉన్న క్యాడర్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ముందుకు తీసుకు వెళ తుందని ఆశ భావం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తుంది. అదే జరుగుతే మిమ్మల్ని నియోజవర్గం పరిస్థితి ప్రశ్నత్కమే..?

# వక్ఫ్ బోర్డు రక్షణ కోసం భైంసాలో ఉద్యమ జోష్

### వక్ఫ్ బోర్డు రక్షించండి - రాజ్యాంగాన్ని కాపాడండి ఉద్యమం భైంసా పట్టణంలో జాయింట్ ఎక్షన్ కమిటీ ఏర్పాటు



**తెలంగాణ సేన న్యూస్: ఏప్రిల్ 18 :** భైంసా: ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సాగుతున్న "వక్ఫ్ బోర్డు రక్షించండి - రాజ్యాంగాన్ని కాపాడండి" ఉద్యమం కింద భైంసా పట్టణంలో జాయింట్ ఎక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. మస్జిద్ ఉస్మాన్ ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి సమావేశంలో వివిధ మతాల పెద్దలు, రాజకీయ నాయకులు, సమాజ సేవకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఫ్తీ అబ్దుల్ గనీ ఖాసిమీ (జమీయతుల ఉలమాఇ హింద్ - ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు) మాట్లాడుతూ - కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు 2025 రాజ్యాంగ విరుద్ధమని, ఇది ముస్లింల ఆస్తులైన మసీదులు, మదరస్సాలు, కబ్రస్తాన్, దర్గాలు తదితరాల భద్రతకు ముప్పుగా నిలుస్తుందని తీవ్రంగా ఖండించారు. వక్ఫ్ బై యూజర్ హక్కును తొలగించడం అత్యంత అన్యాయమన్నారు. వెంటనే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మౌలానా షాహిద్ గఫ్రాన్ ఖాసిమీ మాట్లాడుతూ, అన్ని మతాల నాయకులు కలిసి మద్దతు తెలిపిన ఈ సమావేశం ఐక్యతకు ప్రతీక అని, ఈ ఉద్యమం దీర్ఘకాలికంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. మొబీన్ అహ్మద్ (జమాత్ ఇస్లామీ అమీర్, భైంసా) మాట్లాడుతూ, ఈ ఉద్యమానికి దళితులు, క్రిస్టియన్లు, ఇతర మతాల సెక్యులర్ వ్యక్తుల మద్దతు అత్యవసరం అని తెలిపారు. ఇంకా కార్యక్రమంలో హాఫిజ్ ఖాలిద్ మొహమ్మదీ, హాఫిజ్ మునీర్, హాఫిజ్ సయ్యద్ అబ్దుల్ లతీఫ్, ముఫ్తీ షహబాజ్ నవాజ్ ఖాసిమీ, సయ్యద్ లతీఫ్, అయూబ్ అహ్మద్ రాయిల్, ఫయుజుల్లా ఖాన్ (ఎంఐఎం), ఫారూక్ అహ్మద్ సిద్దిఖీ, అడ్వొకేట్ మునీర్ అహ్మద్, ప్రముఖ జర్నలిస్టు ముహమ్మద్ ఖలీమ్ తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో ముఫ్తీ ఖాలిద్ గఫ్రాన్ ఖాసిమీ, మౌలానా సల్మాన్ ఖాసిమీ, మౌలానా రఫె ఖాసిమీ, మౌలానా యూనుస్ ఖాసిమీ, మహ్మద్ ఆమిర్ అహ్మద్ (మాజీ కౌన్సిలర్), కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్, మక్సూద్ ఖాన్, ఎం.ఎ. లతీఫ్, హఫీజుల్లా ఖాన్ తదితర మత పెద్దలు, మస్జిద్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ : ఏప్రిల్ 18: తెలంగాణ సేన న్యూస్ :** రైతులందరూ జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేఎల్పీ నేత



ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ లో %ఖీజూ% ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. నిర్మల్ నియోజకవర్గంలోని రైతులందరూ ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనీస మద్దతు ధర 3371 /- ఉందని, రైతులందరూ తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నవీన్, నరేందర్, పద్మాకర్, తో పాటు ధర్మాజీ రాజేందర్, భీమ్ రెడ్డి, రైతులు, మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బోయిగూడ చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



**బన్సీలాల్ పేట్, తెలంగాణ సేన న్యూస్, ఏప్రిల్ 18 :** గుడ్ ఫ్రైడే సందర్భంగా న్యూ బోయిగూడలోని 'సెయింట్ జాన్ మరియా వియాన్నే' చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు ప్రభువు ప్రజల కోసం తన రక్తాన్ని చిందించి సిలువను మోసిన ఘట్టాన్ని లాజరస్ జోసెఫ్ అనే యువకుడు ఆకట్టుకునేలా ప్రదర్శించాడు. అనంతరం చర్చి ఫాదర్ ప్రతాప్ పారిష్ ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ గుడ్ ఫ్రైడే కార్యక్రమంలో చర్చి కమిటీ యూత్ సభ్యులు లాజరస్, మెర్సీ అంతోని, జాకోబ్, డేవిడ్, అరుల్ రాజ్, సవియో, అవేర్, నోవెల్, సహాయ ఫాదర్ నరేష్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# సకలైశ్వర్య ప్రధాయిని పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన సేవ

### స్వర్ణ గిరి దేవస్థానంలో శుక్రవారం వైభవంగా వెంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణం



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, ఏప్రిల్ 18 :** సకలైశ్వర్య ప్రదాయిని పద్మావతి అమ్మవారి అష్టోత్తర శతనామాలతో విశేష కుంకుమార్చన సేవ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కొరకు సుదర్శన నరసింహ హవనం నిర్వహించారు. పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి సువర్ణ భరిత వజ్రా భరణాలతో, సుగంధ పుష్ప మాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి విశిష్ట కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. దివ్య క్షేత్రంలోఅన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3500 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వేంకటేశ్వర స్వామి ని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య భక్తి గీతాలాపనల తో శ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.

# గ్రామదేవతల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ దేవతల పండుగలు శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి ఎల్లమ్మ మహంకాళి అమ్మ మత్తడి పోచమ్మ మరియు నాభి శిలా దేవతల ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ అనంతరావుపల్లి గ్రామస్తులకు, ప్రజలకు గ్రామదేవతల అనుగ్రహం ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమం నాయకులు గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు, నాయకులు బైరం రమేష్,గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్, సుఖేందర్ రెడ్డి, దామానమైన మల్లేశం, దార మల్లేశం, దావుగారి యాదం, దావుగారి కిషన్, దావుగారి రామారావు, ప్రభాకర్, నర్సింలు, కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

### ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**కుంటాల : ఏప్రిల్ 18. తెలంగాణ సేన న్యూస్ :** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వమే ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుంటాల, కల్లూరు, పెంచికల్ పాడ్ గ్రామాలలో జొన్న అలాగే ఓల, అంబకంటి, లింబ (కె ) గ్రామాలలో వరి ధాన్యం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జొన్న క్వింటాలుకు రూ,, 3.371, వరి ఎ గ్రేడ్ 2320,బి గ్రేడ్ 2300 కనీస మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్,ఫ్యాక్స్ చైర్మన్ సట్ల గజ్జరాం, మాజి ఎంపిపి అప్కా గజ్జరాం, ఫ్యాక్స్ డైరెక్టర్లు,నాయకులు పిప్పెర వెంగల్ రావు,జి.వి రమణ రావు,భోగ గోవర్ధన్,గంగయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్క లను సన్మానించిన ఆత్రం సుగుణక్క



**ఆదిలాబాద్: ఏప్రిల్ 18:తెలంగాణ సేన న్యూస్ :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్క లను జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం బోరజ్ మండలం పూసాయి గ్రామంలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సులో సుగుణక్క పాల్గొన్నారు. మావల మండల కేంద్రంలో నమూనా ఇందిరమ్మ గృహం ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కావలసిన నిధులపై మంత్రులతో సుగుణక్క చర్చించారు. సుగుణక్క వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# వరదరాజపురం బ్రహ్మోత్సవాలకు చిన జీయర్ స్వామికి ఆహ్వానం



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరదరాజ పురంలో శ్రీ వరదరాజ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని శుక్రవారం చిన జీయర్ స్వామీజీని కలిసినా పురోహితులు,ఈ సందర్భంగా వరదరాజ స్వామి ఆలయ పురోహితులు మాట్లాడుతూ వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతానని చిన్న జీయర్ స్వామి అన్నారని అన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 19 - 04 - 2025

# రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట తెలంగాణ సేన :** నేడు గిర్నిబావి మండలం, మందపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలుకేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు 'రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు ఏ గ్రేడ్కు రూ. 2320,కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17% మాయుచర్ ఉండాలి అని అన్నారు.నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని,లారీలలో మిల్లుల కు తరలించిన ధాన్యాన్ని అన్లోడ్ చేసే దగ్గర జాప్యం జరగకుండా చూడాలనీ సూచించారు.కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు.రైస్ మిల్లులో విక్రయాలకు బోనస్ వర్తించదని ప్రతి ఒక్క రైతుకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలికసదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణ, హమాలీ గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు,మండల నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,అధికారులు, గ్రామ నాయకులు,కార్యకర్తలు తదిపరులు పాల్గొన్నారు.

# సర్వేల్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి




**తెలంగాణ సేన న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం, సర్వేల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఐకేపీ, పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నల్లగొండ డిసిసిబి చైర్మన్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, వెలిమినేడు పిఏసిఎస్ చైర్మన్ రఘుమా రెడ్డి, గుజ్జ పిఏసిఎస్ చైర్మన్ దొడ యాదిరెడ్డి గార్లు ప్రారంభించారు. అనంతరం మండలంలోని తదితర గ్రామాలకు సంబంధించినటు వంటి ఐకెపి సెంటర్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రతి ధాన్యం బస్తా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం డిప్యూటి ఎమ్మార్వో పాండు, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చెన్నోజు బ్రహ్మాచారి, సీఈవో శ్రీకాంత్ రెడ్డి, ఏఈఓ సుర్వి నవ్య, నారాయణపురం ఏవో వర్షిత, పిఏసిఎస్ డైరెక్టర్లు దొడ నర్సిరెడ్డి, ఎర్ర శ్రీశైలం, మల్లె మంజుల, వస్కుల పద్మ, కసిరెడ్డి యాదిరెడ్డి, కొర్ర బిక్కు, తంగెళ్ల సత్తయ్య, గుత్త శ్రీధర్ రేడ్డి, సుర్వి తిరుపతయ్య, పగిళ్ల యాదయ్య, వీరమల్ల లింగయ్య గౌడ్, సిపిఐఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బండ శ్రీశైలం, బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నర్సింహ్మా, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వీరమల్ల జంగయ్య గౌడ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు నలపరాజు పద్మ స్వామి, మాజీ ఆలయ చైర్మన్లు నలపరాజు నర్సింహ్మా, వెనుముల జగన్ రెడ్డి, వర్ధం నాగార్జున, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయ నర్సింహ్మా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు పువ్విచ్చి స్వాగతం

**నిర్మల్ డిపోలో ప్రయాణికుల మర్యాద దినోత్సవం**



**నిర్మల్:: ఏప్రిల్ 18: తెలంగాణసేన న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ (ఆర్టీసీ) ప్రతి నెల మూడవ శుక్రవారం నాడు జరుపుకునే ప్రయాణికుల మర్యాద దినోత్సవం కార్యక్రమాన్ని నిర్మల్ ఆర్టీసీ డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాజాగా డిపో మేనేజర్గా బాధ్యతలు స్వీకరించిన కే. పందరి గారు స్వయంగా బస్టాండ్లో గల ప్రతి బస్సులోకి ఎక్కి, ప్రయాణికులను అభివాదిస్తూ గులాబీ పువ్వులు అందజేశారు. మీరు మన ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నందుకు మీకు శుభాకాంక్షలు అంటూ ప్రయాణికులతో మమేకమయ్యారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమైనది, సుఖవంతమైనది, శుభప్రదమైనది అని పేర్కొంటూ, భవిష్యత్తులో తమ కుటుంబ సభ్యులతో పాటు ఆర్టీసీ సేవలను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి ప్రయాణికుడికి ప్రత్యేకంగా కీచైన్లు పంపిణీ చేశారు. ఈ కీచైన్లో ఒకవైపు ఆర్టీసీ లోగో, మరోవైపు క్యూ ఆర్ కోడ్ ఉంది. ఈ కోడ్ను స్కాన్ చేస్తే ఆర్టీసీ అందిస్తున్న పది ప్రధాన సేవలు కనిపిస్తాయని డిపో మేనేజర్ తెలిపారు. బస్సుల ప్రత్యక్ష సమాచారం కోసం "గమ్యం యాప్,ఆన్లైన్ టికెట్ బుకింగ్కు బుకింగ్ యాప్, కొత్త బస్సులు, అద్దె బస్సుల వివరాలు,బస్ పాస్ వివరాలు,సోషల్ మీడియా ద్వారా సమాచారాన్ని తెలుసుకునే మార్గాలు ఉన్నాయి. ప్రయాణికులంతా ఈ కీచైన్లోని కోడ్ను స్కాన్ చేసి సంబంధిత యాప్స్ను ఇన్స్టాల్ చేసుకుని ఆర్టీసీ సేవలను మరింతగా వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ కుమార్, స్టేషన్ మేనేజర్ ఏ.ఆర్. రెడ్డి, వి.జి. రెడ్డి, కంట్రోలర్లు, కండక్టర్లు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటులో బీసీ బిల్లును ఆమోదించేందుకు కృషి చేయండి

**బత్తుల సిద్ధిశ్వర్ దీక్షను విరమింప చేయండి ఆమరణ నిరాహార దీక్ష నుండి ప్రాణాలు కాపాడండి**

**మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ కు వినతి పత్రం సమర్పించిన హిందూ బీసీ సంఘాల నాయకులు**



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, ఏప్రిల్ 18 :** పార్లమెంటులో బిసి బిల్లును ఆమోదింప చేయడానికి కృషి చేయాలని , హిందూ బీసీ సంఘాల నాయకులు ఎంపీ ఈటల రాజేందర్ కు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన నివాసంలో కలిసి విజ్ఞాపన చేశారు. దేశవ్యాప్తంగా జన గణనలో కుల గణన జరపాలని పేర్కొన్నారు.తెలంగాణ బీసీ బిల్లులను 9 వ షెడ్యూల్ లో చేర్చాలని విజ్ఞాపన పత్రంలో సూచన చేశారు.సందర్భంగా ఢిల్లీలో బత్తుల సిద్దేశ్వర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను విరమింపజేసి సిద్దేశ్వర్ ప్రాణాలు కాపాడాలని. ఈటల రాజేందర్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ రెండు అంశాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని, పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎంపీ ఈటెల హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఆమరణ నిరాహార దీక్ష విరమించాలని కోరారు."అన్న మన అన్నే గాని వదిన...కాదు"అన్నట్టు, ఈటల రాజేందర్ మన అన్నే గాని అధికారం ఆధిపత్యకులాల చేతుల్లో కేంద్రీకృతం అయి వుంది కదా ! అది నిరంతరం బీసీలకు అన్యాయం చేయడానికే చూస్తుంది అని ఆందోళన వ్యక్తపరిచారు.బీసీలుగా ఇంకా చైతన్యం అయ్యి అందరూ ఒక్కటి కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది అని అన్నారు.

# ప్రజా సేవకునిగా ఉన్నాను...ప్రజలకు వారధినై సేవలందిస్తా

**ఆ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరును ప్రశ్నిస్తే తప్పా...!**
**ఒక గిరిజన కుటుంబం నుంచి ఎదిగిన సామాన్యుడు**
**తరతరాల నియోజకవర్గ బూజును దులిపిన వీరుడు**
**తాను చదువుకున్న చదువుకు బోలెడు సంపాదనను వదిలి...**
**మూడు పర్యాయలుగా ఓడిన పట్టు వదలని విక్రమార్కుడిలా**
**ప్రజలకు నేనున్నానని ఒక భరోసా కల్పించిన గిరిజన వైద్యుడు**
**తనను నమ్ముకున్న ప్రతి కార్యకర్తలు, నాయకులను , అభిమానులను ఆసరాగా నిలుస్తున్న డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్**
**చిన్న గూడూరు మండలంలో ఇప్పటికే మూడున్నర కోట్ల 16 నెలలోనే అభివృద్ధి పనులు చేపించిన ఘనత సాధించిన ఎమ్మెల్యే...**
**గునీగంటి కమలాకర్ - డోర్నకల్ కాంగ్రెస్ అధ్యక్షులు**






**మహబుబాబాద్ రురల్ తెలంగాణ సేన ఎప్రిల్ :** అధోగతి పాలవుతున్న రాష్ట్రాన్ని కుటుంబ పాలనకు విముక్తికై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాల లో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని స్థాపించి తెలంగాణ ప్రజల కష్టాలను తీరుస్తున్న క్రమం చూస్తుందే కదా... ఇక ఇక్కడ డోర్నకల్ నియోజకవర్గం లో ఆరు పర్యాయలుగా రెడ్యా నాయక్ ఓ గిరిజన దొర పాలన క్రమాన్ని మనం చూసాం. ఏ ఒక్క గిరిజన నాయకున్ని ఎదగనీయకుండా కుటుంబ సభ్యులను ఎంపీని చేసిన ఘనత రెడ్యానాయక్ కే దక్కింది.. పాతుకపోయినా రెడ్యానాయక్ ను కూకటి వేళ్లతో పెకిలింప చేసి 53 వేల ఓట్ల మెజార్టీతో రామచంద్ర నాయక్ ను ప్రజలు గెలిపించాలని గునీగంటి కమలాకర్ అన్నారు. చిన్న గూడూరు మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలి, ప్రతి ఒక్క బడుగు బలహీన, అణగారిన, హరిజన, గిరిజన, మైనారిటీ వర్గాలకు సేవ చేయాలని కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ కు బిఆర్ఎస్ నాయకులు అల్లరి మూకలుగా ఏర్పడి సోషల్ మీడియాలో హంగామా సృష్టిస్తున్నారు.తను ఒక ఎం.డి వైద్యుడు తనకు సంపాదన విషయంలో ఆలోచించే విషయమే లేదు..మూడు సార్లు ఎమ్మెల్యే గా ఓడిన మొక్కవోని ధైర్యంతో ముందుకు నడిచి విజయకేతనం ఎగురవేసిన వీరుడు,ధీరుడు రాంచంద్రునాయక్ కార్యకర్తలకు పెద్దదిక్కు వామపక్ష పార్టీలకు వెన్ను దన్ను తన గెలుపునకు కృషి చేసిన వారికి ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఎల్లప్పుడూ అండదండగా ఉంటూ వారికి తోడ్పాటు ఇస్తున్న సందర్భాన్ని మనం చూస్తున్నాం.మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ , ఆత్మ కమిటీ చైర్మన్ అందరి అభిప్రాయాలు సేకరించి నియమించిన విశాల దృక్పథం గల వ్యక్తి ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్.చిన్న గూడూరు మండలం అభివృద్ధి కొరకు సుమారు మూడున్నర కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభోత్సవాన్ని చేసిన అభినవ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే రామచం ద్రనాయక్ పేరొం దారు. రైతులు పండించిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నారు. ఈ సందర్భంగా చిన్న గూడూరు మండలంలో ఆకీరు వాగులో ఉన్న అన్యాక్రాంతం అవుతున్న సహజ వనరులు అయినటువంటి ఇసుక నిలువు దోపిడీ గురవుతుంటే తట్టుకోలేనీ ఎమ్మెల్యే గారు, ఈ సందర్భంలో అధికారుల అలసత్వం కారణంగా అడిగితే దాన్ని రాద్దాం చేస్తే ఇక్కడ ఒరిగేదేమీ లేదని చెప్పవచ్చు.ఇంతకుముందు డోర్నకల్ నియోజకవర్గం లోని చిన్న గూడూరు, నరసింహుల పేట అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ చెప్పినట్లు ఇసుక మాఫియా కు అధికారుల యంత్రాంగం నడిచేది.. ప్రస్తుతం ఇంకా కొంతమంది అధికారులు ఆ అలవాటు విధానాన్ని ఇంకా మరువడం లేదు. ఇది గమనించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్, డాక్టర్ రామచంద్రనాయక్ అనేక మార్లు సంబంధించిన అధికారులకు ఇసుక అక్రమంగా తరలుతున్న పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. నిబంధన అనుసరించి టోకెన్ ద్వారా సక్రమమైన పద్ధతిలో ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని సూచించిన అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజల విజ్ఞప్తి మేరకు, సామాన్య ప్రజలకు ఇసుక సరసమైన ధరలకు అందించేందుకు, ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నిస్తే అది మహా పాపమని కొంతమంది సోషల్ మీడియాలో రోల్స్ చేస్తున్నారు.

**రాష్ట్రాన్ని కుటుంభ పాలనతో అస్తవ్యస్తం**
**ఇక్కడేమే నియోజకవర్గం అతలాకుతలం**

రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా పరిపాలన చేసి రాష్ట్ర ఖజానాను ప్రాజెక్టుల పేరుతో డబ్బులు దోచుకున్న కేసీఆర్ కుటుంబం అయితే నియోజకవర్గంలోని బడా కాంట్రాక్టర్లకు పనులు ఒప్పజెప్పి కమిషన్ల ద్వారా ఎమ్మెల్యేగా ఉన్నన్ని సంవత్సరాలు వేల కోట్లకు పరిగెడీన వ్యక్తి రెడ్యా నాయక్ ఐతే నిస్వార్థంగా పనిచేస్తూ ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త సామాన్యుడు ఎదగాలని కలలు కంటున్న వ్యక్తి మన ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి తండాలో, ప్రతి పల్లెలో, సామాన్య కార్యకర్తలకు పనులు ను ఇచ్చిన వ్యక్తి ఎమ్మెల్యే రామచంద్రనాయక్

**అక్రమాలకు కేరాఫ్ గా మండలాలు**

మొన్నటి వరకు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మండల కేంద్రాలతో గ్రామాల్లో నిలిచేవి రేషన్ బియ్యం, నల్ల బెల్లం, ఇసుక మాఫియా ఆరు కాయలుగా వీరాజిల్లేది డాక్టర్ రామచంద్రనాయక్ ఎమ్మెల్యేగా నాటి నుండి అక్రమాలకు ఫుల్ స్టాప్ పెడుతు అధికారులను సమన్వయ పరుస్తూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ నియోజకవర్గాన్ని అవినీతి రహితంగా తీర్చిదిద్దెందుకు ప్రయత్నిస్తుంటే అధికారులు సహకరించకపోవడం శోచనీయంగా మారింది. దీంతో అధికారులను పలుమార్లు హెచ్చరించడం జరిగింది.గత బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అధికారులను భయభ్రాంతులను చేసి అనేక అవినీతి కార్యక్రమాలకు నాటి టిఆర్ఎస్ నాయకులు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ముందస్తు ప్రణాళిలతో ముందుకు**

ముందస్తు ప్రణాళికతో విద్య వైద్యానికి ప్రాధాన్యత ఉంటుందని ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ అనేకసార్లు వివిధ సభలో చెప్పుకొచ్చారు. నియోజకవర్గంలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థాపన, తెలంగాణ మోడల్ స్కూల్ , ప్రతి మండలంలోని ప్రాథమిక వైద్యశాలల్లో మెరుగుపరిచి ప్రతి పేదవాడికి వైద్యాన్ని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.ఉచితం రేషన్ బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రెండు లక్షల రూపాయల వ్యవసాయ రుణమాఫీ, మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, సబ్సిడీ సిలిండర్లు,మొదలగు సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి ని ముందుకు నడిపిస్తుంటే మెచ్చుకోను పోను రాద్దాం తాలు చేస్తూ అభివృద్ధి ని అడ్డుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ఆగ్రహిస్తున్నారు.

# కలెక్టర్ కరెంటు ఇంటి నెంబర్లు ఇవ్వాలని నల్లముసుగులతో దీక్షలో కూర్చున్న గుడిసె వాసులు

**దళితరత్న కళ్ళే పెల్లి ప్రణయ్ దీప్ మాదిగ**
**పార్టీజాతీయ ప్రతినిధ వరంగల్ జిల్లా అధ్యక్షులు**



**నర్సంపేట తెలంగాణ సేన :** 18/4/2025 శుక్రవారంరోజున నర్సంపేట టౌన్ పాత ఎంఆర్ఓఆఫీస్ఆవరణలో నేటికీ25వరోజు కుచేరినరిలేనిరాహార దీక్షలు దీక్షలకుసభాధ్యక్షులుగా జలగంరమేష్ జిల్లా అధ్యక్షులు వ్యవహరించగా ముఖ్య అతిథులుగా దళిత రత్న కళ్ళే పెల్లి ప్రణయ్ దీప్ ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి జాతీయ ప్రతినిధి అధ్యక్షుడు వరంగల్ జిల్లా అధ్యక్షులు 25వరోజుకుచేరినరిలే నిరాహార దీక్షలు ప్రారంభించి దీక్షలు ఉద్దేశించిలిమాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాలు సుదీర్ఘ భూ పోరాటం గుడిసెల ప్రజల పక్షాన ఉద్యమం కొనసాగుతుంది. నర్సంపేట పట్టణంలవరంగల్ రోడ్లోని813 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో నిలువ నీడలేనినర్సంపేట నియోజకవర్గంలోని. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రకుల నిరుపేదలు గూడు లేని వారికి గూడు కోసం 813 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసినారు. వారి పక్షాన ఎంఎస్పీపార్టీ డి పి టి పి ఎస్ ఉద్యమం చేస్తుంది.. నాలుగు సంవత్సరాలుగా గుడిసెల కోసం భూ పోరాట ఉద్యమం ప్రయాణంలో. అడ్డంకులు అవరోధాలు కష్టాలు, నష్టాలు నిందలు ఎన్ని ఎదురైనానిలబడ్డం వరంగల్ జిల్లా కలెక్టర్ గారికి విజ్ఞప్తి అంబేద్కర్ నగర్ గరీబబస్తికి కరెంటు ఇంటి నెంబర్లు ఇవ్వాలని రిలే నిరాహార దీక్షల్లో నల్ల ముసుగులు ధరించి రిలే నిరాహార దీక్షలో కూర్చున్న గుడ్శవాసులు అంబేద్కర్నగర్గరీబబస్తి లికరెంట్ ఇంటి నెంబర్లు రోడ్లు నీళ్లు సౌకర్యం కల్పించారు.గుడిసెలు వేసుకున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలివారికిపట్టాలి అనే డిమాండ్స్ తో నర్సంపేటపాతఎంఆర్ఓ లిఆఫీస్ ఆవరణలో 25 రోజులు రిలే నిరాహార దీక్ష కొనసాగించడం జరుగుతుంది.గుడిసెవాసులహక్కులే మానవ హక్కులను గుర్తించి హక్కులు కల్పించాలి.దీక్షలో కూర్చున్న ఉద్యమ ప్రతినిధులు పాలు విజయ ఆరోగ్యం స్వామి. రత్నం. సుధాకర బిక్షపతి. యాకోబు. చారి. గుంపుల మాలతి లత ప్రమీల లలిత విజయ సారమ్మాలభాగ్యమ్మ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జర్నలిస్ట్ సమావేశం విజయవంతం చేయాలి కప్పర ప్రసాద రావు




**తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ సమావేశం విజయవంతం చేయాలని కప్పర ప్రసాద రావు అన్నారు శుక్రవారం శామీర్పేట్ లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టి జె యు రాష్ట్ర అధ్యక్షుడు కప్పర ప్రసాద రావు మాట్లాడుతూ జూలై నెలలో రవీంద్ర భారతిలో నిర్వహించే తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ సమావేశం విజయవంతం చేయాలి అని అన్నారు జర్నలిస్టులకు అండగా టీజేయు నిలుస్తుందని అన్నారు.

# గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్ కు సన్మానం



**తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్ కు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం రేణుకా ఎల్లమ్మ ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు వాసవి మాత ఉపాసకులు ఆధ్యాత్మిక వేత్త వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశారు అనంతరం వారు మాట్లాడుతూ సముద్రాల హరినాథ్ వ్యాపార రాజకీయ రంగంలో రాణిస్తూ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిరంతరం పాల్గొంటూ సేవే పరమావధిగా ముందుకు సాగుతున్న సముద్రాల హరినాథ్ కుటుంబ సభ్యులకు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి నిండు ఆశీస్సులు ఉండాలని రేణుకా ఎల్లమ్మ ఆలయం లో ప్రత్యేక పూజలు చేసిన ప్రసాదం అందజేయడం జరిగిందని అన్నారు.

# బాసర ఆలయంలో భక్తుల జనసందడి

**అమ్మవారిసన్నిధిలో కిటకిటలు**



**తెలంగాణ సేన న్యూస్: ఏప్రిల్ 18 :** నిర్మల్ జిల్లా :-బాసర పవిత్రమైన పుణ్యక్షేత్రం చదువే తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు ఆలయంలో పోటెత్తిన భక్తులు శుక్రవారం కావున శుభ ముహూర్తం కావడంతో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్మించారు తెల్లవారు జామున నుంచి గోదావరి నదిలో పుణ్యా స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది ఇతర ప్రాంతాల నుంచి మహారాష్ట్ర. తెలంగాణ. ఆంధ్రప్రదేశ్. నుండి భక్తులు వచ్చారు అమ్మవారి దర్శనం కోసం రెండు గంటల సమయం క్యూలైన్లో నిలిచారు భక్తులు పూజలు చేసి అమ్మవారిని మొక్కలు తెరుచుకున్నారు అనంతరం అమ్మవారిని దర్శించుకొని చిన్నారులని వారి యొక్క తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు . భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు మరియు పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# రేబల్లి శ్రీనివాస్ ను సన్మానించిన వంగపల్లి అంజయ్య స్వామి



**తెలంగాణ సేన న్యూస్ :** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ ప్రధాన కార్యదర్శి, కీసరగుట్ట వాసవి కన్యకా పరమేశ్వరి నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి రేబల్లి శ్రీనివాస్ గుప్తను శుక్రవారం ఆధ్యాత్మిక వేత్త వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశారు అనంతరం వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ యువ నాయకుడు రేబల్లి శ్రీనివాస్ గుప్త సేవలు అభినందనీయం అని రాజకీయ వ్యాపార రంగంలో రాణిస్తూ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న రేబల్లి శ్రీనివాస్ ను చిరు సన్మానం చేసి యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి లడ్డు ప్రసాదం అందజేయడం జరిగిందని అన్నారు.

# గంగారం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి**



**గంగారం తెలంగాణ సేన :** ఏఐసీసీ , రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు , రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క పిలుపు మేరకు , ములుగు నియోజకవర్గ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు గంగారం మండల కేంద్రం నందు జై బాపు - జై భీమ్- జై సంవిధాన్ సన్నాహక సమావేశం తేదీ:- 19.04.2025 శనివారం రోజున మధ్యాహ్నం 10:00 గంటలకు గంగారం మండల కేంద్రము నందు ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు గారి ఆద్వర్యంలో జై బాపు - జైభీమ్ జై సంవిధాన్ సన్నాహక సమావేశం నిర్వహించబడును . ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి గారు హాజరు కానున్నారు. జాడి వెంకటేశ్వర్లు గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గుండగాని శ్రీధర్సో షల్ మీడియా కోఆర్డినేటర్ కావున గంగారం మండలం లోని ముఖ్య నాయకులందరు హాజరవ్వాలని కోరారు.

# ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య - తానూర్ మండలంలో విషాదం

**తెలంగాణ సేన న్యూస్ ఏప్రిల్ 18(నిర్మల్ జిల్లా) తానూర్ :** మండలంలోని ఉమ్రి (కే) గ్రామానికి చెందిన కదం బాలాజీ (45) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన తానూర్ మండలంలో విషాదాన్ని మిగిల్చింది. ఈ విషయాన్ని ఎఎస్సై బానుప్రసాద్ వెల్లడించారు.మృతుడు బాలాజీ తనకున్న రెండు ఎకరాల్లో సాగుచేసిన పంటకు సరైన దిగుబడి రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. గతంలోనూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఆయనను గ్రామస్తులు అప్పుడు రక్షించారు.కానీ గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని బాలాజీ ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం గమనించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ట్రైనీ ఎస్సై నవనిల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.మృతునికి భార్య మోనాబాయి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మనసు.. కవిత్వం



కట్టుబాట్లను వదిలేసినప్పుడు సంతోషంగా ఉన్నా, తర్వాత సమాజం నుంచి వచ్చే విమర్శల వల్ల దుఃఖమూ కలుగుతుంది. మనసు ఒక్కోసారి ఆకాశంలో విహరిస్తున్నట్టుగా, ఒక్కోసారి దుఃఖపడుతూ, ఒక్కోసారి నిస్తేజంగానూ, నిరుత్సాహంగానూ ఉంటుంది. మన మనసు ఎలా ఉంటే, ఆ భావం ముఖంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఒక మనిషి చెడ్డవాడా, మంచివాడా అనే నిర్ణయం మనసును బట్టే ఉంటుంది. అందుకే, ఎందరో వాగ్గేయకారులు, గేయ రచయితలు ఎంతో అనుభవంతో, మనసును సంబోధిస్తూ రచనలు చేశారు. భారతీయ సంగీతంలో, వివిధ సాహిత్య రీతుల్లో మనసును సంబోధిస్తూ అనేక రచనలు చోటుచేసుకున్నాయి. మనసుకు ఒక రూపం అంటూ లేదు. కానీ, మన ఇంద్రియాలకు మాత్రం అధికారి మనస్సే. మనం ఏ పనిచేసినా, అది మనసుతో ముడిపడి ఉంటుంది. మనిషి పురోగతికి, తిరోగతికీ మనసే కారణం. అందుకే అది స్వేచ్ఛగా తిరగాలని, కట్టుబాట్లను వదిలేయాలని చూస్తుంది. మనసు, దాని స్వరూప స్వభావాలు, జీవితంలో ఎదురయ్యే వివిధ సందర్భాల్లో మనసు తీరుతెన్నులు ఎలా ఉంటాయో అనుభవపూర్వక రచనల సాహిత్యాలను పరిశీలించి తెలుసుకుం దాం. భారతీయ సంగీతంలో మనసును సంబోధిస్తూ వెలువడిన వివిధ రీతులైన శాస్త్రీయ, భక్తి, లలిత, జానపద, చలనచిత్ర సంగీతాలు ఎలా ఉన్నాయో, ఆయా రచనల భావం, ఆ రచనల్లో గల సాహిత్య విలువలను ఒకసారి సింహావలోకనం చేద్దాం.

### మొదటగా శాస్త్రీయ సంగీతం...

సామవేద జనితమైన శాస్త్రీయ సంగీతం హిందుస్తా నీ, కర్ణాటక సంగీత బాణీలుగా ఉన్నది. వీటిలో కర్ణాటక సంగీతం, మన దక్షిణ భారతానికి చెందిన ది. ఈ సంగీత రీతిలో మనసు మీద రచనలు ఎక్కువగా తెలుగులో తర్వాత సంస్కృతం, హిందీ, తమి ళం, కన్నడం వంటి ప్రాంతీయ భాషల్లో వచ్చాయి. 18వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారులైన త్యాగ య్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు కర్ణాటక సం గీతానికి త్రిమూర్తులు. వీరికృతులు, కీర్తనలు, రచనలు, నేటి శాస్త్రీయ సంగీతం అనేంతగా సంగీత ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. ఈ ముగ్గురిలో త్యాగరాజ స్వామి రచనలు అప్పటి సామాజిక పరిస్థితులకు దగ్గరగా ఉం డటం వల్ల విశేష ఆదరణ పొందాయి. త్యాగరాజు రామభక్తుడు. వుంఛవృత్తి చేస్తూ జీవనం గడిపేవాడు. ఐహిక సుఖములను వదిలి రాముని పరబ్రహ్మగా భావించి నాదోపాసన ద్వారా తరించాడు. ఆయన కృతులలో మనసును సంబోధిస్తూ, మనసుకు వివిధ విషయాల గురించి బోధిస్తూ సాగే రచనలుఎక్కువగా ఉన్నాయి. 'మనసా ఎటులోర్తునే, నా మనవిని చేకొనవే/ దినకరకుల భూషణుని' అంటూ మనసును చెడు స్నేహాలు చేయకుండా, తరింపజేసే మార్గం తెలుపమంటూ వేడుకుంటున్నట్టుగా సాగుతుందీ పాట. 'అలాగే, ఉండేది రాముడొకడు/ ఊరక చెడిపోకే మనసా/ ధర్మాత్ముడు, సర్వసముడు క్షేమకరుడు త్యాగరాజ చిత్తహితుడు/ జగము నిండి' అనే ఈ కీర్తనలో సగుణ రూపుడైన రాముడికి, నిర్గుణమైన పరబ్రహ్మ తత్వాన్ని ఆపాదించి మనసుకు బోధించడం కనపడుతుంది. ఈ కీర్తన 28వ మేళకర్త హరి కాంభోజి రాగంలో ఉన్నది. ఈ రచనలు శాస్త్రీయ సంగీతంలో మచ్చు తునకలు.

### భక్తి సంగీతంలో..

మన భారతీయ జీవనశైలిలో దేవునిపై భక్తి చాలా ఉంటుంది. అయితే, మనిషి ఏ మార్గంలో నడవాలన్నా దానికి మనసు సహకరించాల్సిందే. చిన్నప్పటి నుంచి రామభక్తుడైన త్యాగయ్య 'మనసు స్వాధీనమైన/ ఆ ఘనునికి/ మరి మంత్రతంత్రములేల?' అన్నాడు. అంటే, మనసు సహకారం మనిషికి ఎంత ప్రధానమైనదో దీని ద్వారా తెలుస్తున్నది.

### రామదాసు కీర్తనల్లో!

తెలుగునాట భజనల్లో తప్పకుండా వినవచ్చేవి రామదాసు కీర్తనలు. కంచర్ల గోపన్న తన భక్తి రచనల ద్వారా భక్త రామదాసుగా పేరుగాంచారు. అయితే రామదాసు తన మనసుకు, కేవలం రామునిపై భక్తి, వైరాగ్యాలనే కాకుండా, సామాజిక బాధ్యతను కూడా బోధించాడు. 'శ్రీరాముల దివ్య నామ స్మరణ చేయుచున్న చాలు ఘోరమైన తపములను / కోరనేటికే మనసా భాగవతుల పాదజలము/ పైన చల్లుకొన్న చాలు భగీరథికి పోయ్యేననే భ్రాంతి ఏటికే ' అంటూ ఒక చరణంలో, మరో చరణంలో సామాజిక బాధ్యతగా%ౌ% 'పరుల హింస చేయకున్న /పరమ ధర్మమంతె చాలు/ పరుల రక్షింతునని/పల్కు నేటికే దొరకాని పరుల ధనముల దోచక ఉండితె చాలు గురుతుగాను గోపురము, కట్టనేటికే మనసా' అంటూ ఘోరమైన తపస్సులు చేయవలసిన అవసరం లేదని, మహాభక్తుల పాద జలము చాలు, గంగానది వద్దకు వెళ్లనవసరం లేదనీ చాలా చక్కగా చెప్పారు. అలాగే పరాయివాళ్ల ధనం మీద ఆశపడి వాటిని దోచి పేరు రావడానికి గుడి గోపురాలు కట్టించినా నిష్ఫలమని సామాజికపరంగా అందరికీ కనువిప్పు కలిగించే విధంగా కీర్తనలు చేశారు. మనసుకీ, మనిషికీ మార్గనిర్దేశనం చేయగల ఈ కీర్తన, సాహిత్యపరంగా రామదాసుచే కావించబడిన ఒక గొప్ప మానస సంబోధన.

### లలిత సంగీతం...

గ్రామ ఫోన్ రికార్డులు, రేడియోల ద్వారా జనంలోకి చేరిన సంగీత రీతి లలిత సంగీతం. శాస్త్రీయ సంగీతానికి భిన్నంగా నూతనంగా ఉండే ఈ లలితగీతాలు సంగీతం, ప్రకృతి, ప్రేమా, భక్తి వైరాగ్యం దాకా స్పృశించని అంశం లేదు. శాస్త్రీయ సంగీతంలోని కృతుల లాగా పాండిత్యమే ప్రధానంగా కాకుండా, సాహిత్య రస భావానుగుణమైన రాగ రచనతో ఆధునిక గేయ రచనలను పాడే సంగీతం తొలి రోజుల్లో గీతావళి అని, ఆ తర్వాత లలిత సంగీతం అనీ వాడుకలోకి వచ్చింది. లలిత సంగీత లక్షణాన్ని బాలాంతరపు రజనీకాంతరావు ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర రెండవ భాగంలో చెప్పారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బసవరాజు అప్పారావు, నండూరి వెం కట సుబ్బారావు, బాపిరాజు, బాలాంతపు రజనీకాంతరావు వంటి రచయితలు.. విశ్వనాథ, సాలూరి రాజేశ్వరరావు, చిత్తరంజన్ వంటి స్వరకర్తలు.. ఘంటసాల, బాలమురళికృష్ణ, బాల సరస్వతి, అనసూయ, సుశీల, శ్రీరంగం గోపాలరత్నం వంటి గాయక శిఖామణులు లలిత సంగీతానికి పరిపుష్టిని చేకూర్చారు. మల్లవరపు విశ్వేశ్వర రావు రచించిన ఒక మానస బోధగేయం%ౌ% 'మరపురాని కలలు కని, మరుదినమ్ము మేలుకొని నిరాశలే/ మిగులునని తెలుసుకొంటివా మనసా/ అలసి యుంటివా మనసా ప్రేమ నిన్న రోజుదని/ నేడు కరిగిపోయెననీ/ వేదనయే రేపటనీ తెల్ల మాయెనా! గుండెలు తల్లడిల్లెనా! మనసా! అలసటా యెనా మనసా!' అంటూ ప్రేమలో విఫలమైనప్పుడు మనసు పడే బాధను చక్కగా వివరిస్తుంది. ఒకరిపై ప్రేమ కలగాలన్నా లేదా ఏ విధమైన భావన కలగాలన్నా మనసుదే కీలకపాత్ర. కనుక ఈ గీతంలో ప్రేమ విఫలమైనప్పుడు కలిగే బాధను మనసే పడుతున్నట్టు భావించి కవి ఈ గీతాన్ని రాశారు. అలాగే కృష్ణశాస్త్రి కూడా 'ఒదిగిన మనసున, పొదిగిన భావం' అన్న లలితగీతానికి ఈమని శంకరశాస్త్రి సంగీతం సమకూర్చారు.

### జానపద సాహిత్యంలో

జానపద సంగీతం, సాహిత్యం పల్లె ప్రజల్లో అసువుగా పుట్టాయి. వీటికి సాధారణంగా రచయితలుండరు. ఉన్నా తెలియదు. పల్లెల్లో బుర్రకథలు, హరిదాసులు, యాచకుల వద్ద మనకు వినిపిస్తూ ఉంటాయి. ఇటువంటి వాటిలో ఎక్కువగా మనసుకు సంబంధించిన జ్ఞాన, వైరాగ్యాలను చూపే తత్వసాహిత్యం ఉంటుంది. 'ఇల్లు వాకిలి నాది ఇల్లాలు నాదనచు ఏల భ్రమసితివయ్య మనసా! కాలుని వలలోన/కానక చిక్కితివి కడతేరుటే త్రోవమనసా ఒంటరిగ యాగంటి దాసుని మదిలోన జంట బాయక వుండు మనసా' అంటూ సాగిన జానపద గేయం యాగంటి లక్ష్మప్ప రాసిన గేయంగా, 'ఆంధ్రుల కీర్తన వ్మాయ కళాసేవ' అని ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గ్రంథంలో ఉన్నది. ఇటువంటి జానపద గేయాలు జ్ఞాన భాండాగారాలు. తర్వాతి తరాలవారి కోసం వీటిని భద్రపరచడం మన బాధ్యత.

### చలనచిత్ర సంగీతం..

మనసు గురించి పద్యాలతో ప్రారంభమై, నవరసాలను కురిపిస్తూ, అనేక రీతులను తనలోకి తీసుకుంటూ శాస్త్రీయ, లలిత, జానపద సంగీతాలకు దీటుగా చలనచిత్ర సంగీతం ఆవిర్భవించింది. సినీ గేయ రచయితల లో ఒకరైన ఆత్రేయకు మనసు కవి అని పేరు. మనసునే ప్రధాన కవితా వస్తువుగా తీసుకొని ఆయన ఎన్నో పాట లు రాశారు. వాటిలో మనసు స్వరూపాన్ని, స్వభావాన్నీ చక్కగా చూపిన ఈ పాట 'గుప్పెడు మనసు' లోనిది. 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా తలపులు ఎన్నెన్నో కలలుగా కంటావు కల్లలు కాగానే కన్నీరు అవుతావు చీకటి గుహ నీవు చింతల చెలి నీవు నాటక రంగానివే మనసా/ ఎందుకు వలచేవో /ఎందుకు వగచేవో'.. ఎందుకు రగిలేవో మనసా' అని ఈ పాట సాగుతుంది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడిన ఈ పాట ప్రేక్షకుల మనసును దోచుకున్నది. నిజానికి, అనుకూల పరిస్థితుల్లో కంటే ప్రతికూల పరిస్థితుల్లోనే మనసు ఉనికిని గుర్తిస్తాం. ఇలా క్షణిక ఆనందాల వైపు తిరిగే మనసును, దాని స్వభావాన్ని ఎత్తి పొడుస్తూ, బతిమాలుతూ, ప్రేమ, ఆనందం, బాధ కలబోస్తూ, మనసు మీద రాసిన కవిత్వం, సాహితీ ప్రపంచంలో ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నది. శాస్త్రీయ సంగీతంలోని కృతుల లాగా పాండిత్యమే ప్రధానంగా కాకుండా, సాహిత్య రస భావానుగుణమైన రాగ రచనతో ఆధునిక గేయ రచనలను పాడే సంగీతం తొలి రోజుల్లో గీతావళి అని, ఆ తర్వాత లలిత సంగీతం అనీ వాడుకలోకి వచ్చింది.

# తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక




వాన వెలిశాక మట్టి వాసన, ఆరుద్ర పురుగుల సర్కస్ ఫీట్లు, పిచ్చుకల మట్టి స్నానాలు, వెన్నెల్లో ఆడిన ఆటలు, ఎండకాలం బావుల్లో ఈతలు ఈనాడేవి? మన చిన్నతనం మనకు చిన్నతనం కాదు. బాల్యం మళ్లీ రమ్మంటే వస్తుందా? 'అనుభూతులను పోగొట్టుకున్న గుండె ఎడారి. అనుభూతులను పదిలపరచుకున్న గుండె సతత హరితారణ్యం'. ఇటువంటి మధురమైన భావాల సుమమాల డాక్టర్ నలిమెల భాస్కర్ 'సుద్దముక్క'. ఈ పుస్తకంలో శ్రామిక జనజీవన చిత్రణం ఆర్ద్రంగా ఉంటుంది. శ్రామికుల రుణం తీర్చుకోవాలనిపించేలా చేస్తుంది. తమ బతుకులను బండలకేసి బాదుకుంటూ మన బట్టలను గట్టున ఆరేస్తారు రజకులు. మన బట్టలను పిండి వాళ్లు తోలు బొమ్మలవుతారు. వాళ్లుతికిన దుస్తులతో మనం మన లోపలి ముఖాన్నీ, మురికినీ చాటు చేసుకొని రోజూ నాగరికులమవుతాం. ఎవరి బట్టలను వారికి, తప్పిపోకుండా అందించే అమోఘమైన జ్ఞాపకశక్తి వారిది. 'సమాజ కల్మషాన్ని కడిగివేయడానికి/ కంకణధారులైన వ్యక్తులు సంస్కర్తలైనప్పుడు/ తరతరాలుగా మైలబట్టల్ని/ మల్లెపూలు ఉల్లిపొరలూ చేసేందుకు/ కటి బద్ధులైన వీళ్ళూ సంస్కర్తలే'. ఇలాంటివన్నీ ఒక ఎత్తు అయితే.. ఉపాధ్యాయుని గురించి, సుద్దముక్క గురించి రాసిన ఆరు కవితలు మరొకెత్తు. ఆ ఆరు కవితలలో ఉపాధ్యాయున్ని ప్రపంచాన అగ్రభాగాన నిలిపారు నలిమెల. అధ్యాపకునికి అక్షరాభిషేకం చేశారు. 'అతడు కాలుమోపడం తోటే అణువణువూ అక్షరమవుతుంది/ అతని మాటల రెక్కల మీద/ పిల్లలు అత్యంత సురక్షితంగా/ జ్ఞాన విహాయసంలో విహరించి వస్తారు' అని ఉపాధ్యాయుడి ఔన్నత్యాన్నీ, 'క్లాసులో ప్రవేశిస్తున్న ప్రతిసారీ/ అతని కుడిచేతికి ఆరో వేలు/ అదనంగా మొలుస్తుంది/ అది కచ్చితంగా జ్ఞానం ఘనీభవించిన తెల్లని సుద్దముక్కే' అని చాక్‌పీస్ ప్రాధాన్యాన్ని వెల్లడిస్తారు. సుద్దముక్క సూర్యగోళం నుంచి కోసుకొచ్చిన రశ్మి శకలం. చందమామ నుంచి తీసుకొచ్చిన వెన్నెలగడ్డ అన్నప్పుడు భాస్కర్ కవిత్వం తారస్థాయికి చేరుతుంది. సౌందర్యోపేతం అవుతుంది. చాక్‌పీస్ విద్యార్థులకు 'సమస్తమైన దిక్కులను నిర్దేశించగల చుక్కాని/ తరగతికి వెళ్లే ఉపాధ్యాయునికి ఊపిరి గుళిక/ ఉపన్యాసకులకు ఊతకర్ర'. భాస్కర్ దృష్టిలో ఈ భూమండలం మీద ఏకైక లోకైక దర్శనీయ స్థలం 'బడి'. 'సుద్దముక్క' తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక. ఇందులో అడుగడుగునా కవిత్వం, అణువణువునా నవత్వం, ప్రతివాక్యం ఆస్వాదయోగ్యం, అనుభవైకవేద్యం.

# ఏది తల్లీ గట్లుంటది నాటి సాహిత్యం

## ఏదీ ఎక్కడా కానరావేం మన దగ్గరనే కాదు



పొరుగునే అని కూడా కాదు, మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా ఆ ఉధృతి తగ్గింది. వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితమవుతున్న కవిత్వమే తప్ప సామాజిక పట్టింపు ఎక్కడా కానరాదేం. ముఖ్యంగా మహిళలు రాసే కవిత్వం ప్రేమ రాహిత్యం, వ్యక్తిగత వైఫల్యాలపై వస్తున్నాయే తప్ప సామాజిక, సామూహిక వైఫల్యాలపై ఎందుకు నిరసన కవిత్వం రావడం లేదు. ఆనాటి ఆవేశం నేడు ఎక్కడా కానరావడం లేదేం? ఆనాడు వచ్చిన ఫెమినిస్ట్ కవిత్వం నేడు ఎందుకు రావడం లేదు? ఆనాటి ఫెమినిస్టులు తమ తర్వాత తరానికి ఆ ఆయుధాలను ఇవ్వలేకపోవడమా లేక ఈనాటి కవయిత్రులు ఆ తరాన్ని అందుకోలేకపోవడమా అసలు కారణమేంటి? ఒకరిద్దరు మినహా మిగిలిన కవయిత్రులంతా తమ కవిత్వాన్ని వ్యక్తిగతానికే పరిమితం చేస్తున్నారు. ఆ రోజులతో పోలిస్తే నేడు కవిత్వ ప్రకటనలకు అనేకానేక వేదికలున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో కవిత్వం ఏరులై పారుతున్నది. నిజానికి పత్రికలు కవిత్వానికి ఇస్తున్న స్పేస్ చాలా అంటే చాలా తగ్గిపోయింది. కొన్ని పత్రికలైతే అసలు సాహిత్యం ఓ ఆలంబన అనే విషయాన్నే వదిలేసి ఏండ్లు గడిచిపోయాయి. మిగిలిన సామాజిక మాధ్యమాల్లో కూడా సామాజిక అంశాలపై కవిత్వం రాస్తున్న వారు పెద్దగా కానరావడం లేదు. 80, 90వ దశకాల్లో మహిళలు రాసిన కవిత్వం చదివి చాలామంది ప్రేరణ పొందారు. ఆ కవిత్వాల ద్వారానే కొన్ని ఉద్యమాలు వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నీలిమేఘాలు కవిత్వ సంపుటి తీసుకొచ్చిన తుఫాను.. అలాంటి ఇలాంటి తుఫాను కాదు. అంతవరకూ వ్యక్తులుగా ఉన్న కవయిత్రులంతా ఆ నీలిమేఘాలు అనంతరం సామూహికం అయ్యారు. అందులో ఒక్కో కవితా ఒక్కో తూటాలా మహిళలను కదిలించింది. పురుషులైతే ఇలా ఉన్నామా ఇలా బతుకుతున్నామా? అని తమని తాము ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చింది. అప్పటికింకా చదువు, సంధ్యల్లో గడుపుతున్న నాలాంటి వాళ్లకు నీలిమేఘాలు ఓ సంచలన, సంభ్రమాశ్చర్య కవిత్వ సంపుటి. ఆ సమయంలో ఓల్గా, విమల, జయప్రభ, ఘంటశాల నిర్మల, మందరపు హైమవతి, కొండేపూడి నిర్మల వంటి వారి కవిత్వం చదివి ఉప్పొంగిపోయిన సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో. ఆ కవయిత్రుల్లో కొందరు పూర్తిగా కవిత్వానికి దూరమయ్యారు. మిగిలినవారు రాస్తున్నా ఆ నాటి వాడి, వేడి ఎందుకు తగ్గిందో? మహిళలందరూ.. 'ఎవరి బతుకులు వారివే. మనకెందుకు ఇదంతా' అనే ఓ నిర్లిప్త వాతావరణంలోకి వెళ్లిపోయారా? సామూహికంగా మారి ఓ ఉద్యమ స్థాయిలో కవిత్వాన్ని పండించినవారంతా ఇప్పుడు ఒక్కరుగానే మిగిలిపోతున్నారా? అప్పట్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. దానికి తోడు సమాజంలో ఓ చిన్నచూపు. కానీ, నేడు పరిస్థితులు కొంత మారాయి. ముఖ్యంగా దేశంలో గ్లోబలైజేషన్ కారణంగా వచ్చిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. ఐటీ ప్రవేశంతో జీవితాలు మారిపోయాయి. స్త్రీలకు తాము చదివిన చదువులకు తగ్గట్టుగా ఉద్యోగాలు వచ్చాయి. ఆర్థిక స్వావలంబన పెరిగింది. పురుషుడితో సమానంగా తానూ ఎదిగాననే ఆత్మవిశ్వాసం వచ్చింది. లక్షల్లో జీతాలతో పాటు తన కోర్కెలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశాలు వచ్చాయి. దీని ప్రభావం సాహిత్యం మీద పడిందా? ఇవన్నీ ప్రశ్నలే. జీవితం సంతృప్త స్థాయికి చేరిందనుకోవాలా? అందుకే వ్యక్తిగత వ్యవహారాలకే నేటి కవయిత్రులు పరిమితమవుతున్నారని భావించాలా? ఇదంతా కావచ్చు కానీ నా మటుకు నాకు అనిపించింది ఏమిటంటే.. ఓ కేంద్రీకృత ఉద్యమం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. అసలు ఉద్యమం అనేదే లేకుండాపోయింది. కథకుడు ఖదీర్‌బాబు చెప్పినట్టు 'కనీసం ఊళ్లు పట్టుకు ఊరేగడానికి ఉద్యమమూ లేదు' అన్నట్టుగా మారింది. అమ్మ నవలలో 'పావెల్ చేత మన ఆలోచనలన్నింటికీ కేంద్రం ఉద్యమమే కావాలి' అని మాక్సిం గోర్కీ చెప్పిస్తాడు. ఆ కేంద్ర స్థానాన్ని, ఆ ఉద్యమాన్ని ఇక్కడివారు పట్టించుకోకపోవడం వల్లనే ఇలా జరుగుతోందా? రాష్ట్రం విడిపోవడానికి ముందు తెలంగాణ సాధన కోసం అనేక మంది కవయిత్రులు ఉద్యమ కవిత్వాన్ని అద్భుతంగా రాశారు. దాని ప్రభావం కచ్చితంగా ఉద్యమంపై పడి అది మరింత బలపడింది. కవిత్వమో, పాటో, కథో, నవలో మొత్తానికి తెలంగాణ ఉద్యమానికి అనుకూలంగా, ప్రత్యేక రాష్ట్రం రావాల్సిన ఆవశ్యకతపై సాహిత్య సృజన జరిగింది. రాష్ట్రం సిద్ధించింది. చిరకాల కోరిక ఈడేరింది. ప్రాంతీయ ఉద్యమాలే ఆలంబనగా ఆ సాహిత్యం వచ్చింది. అయితే, ఆ తర్వాత అంతే ఉద్యమ, సామాజిక స్ఫూర్తిని ఇవ్వాల్సిన సాహిత్యం కూడా నిలిచిపోయిందా. ఇప్పుడూ కవయిత్రులు రాస్తున్నారు కదా అనే ప్రశ్న రావచ్చు. వస్తోంది. ఆ కాలంతో పోల్చుకుంటే చాలా తక్కువగానే రాస్తున్నారు. తాము స్పందించకపోతే ఎలా అనే కారణంగానే ఒకటి, రెండు రాస్తున్నారు. ఎక్కువగా మాత్రం కవయిత్రులు తమ వ్యక్తిగతానికే పరిమితం అవుతున్నారని అనిపిస్తున్నది. అంతకుముందు ఉమ్మడి ఏపీలో వచ్చిన అనేకానేక ఉద్యమాలకు స్ఫూర్తి ఆ నాటి సాహిత్యమే. ఆ తర్వాత వచ్చిన పరిణామాల ప్రభావం సాహిత్యంపై పడటమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇప్పుడు రాస్తున్న కవయిత్రుల్లో చాలామంది అద్భుత కవిత్వాన్నే రాస్తున్నారు. కానీ, ఎక్కడో ఓ వెలితి వెంటాడుతోంది.

# రోజూ ఉదయం కడుపులో మంటగా ఉంటుందా అయితే ఈ చిట్కాలను పాటించండి



సాధారణంగా చాలా మంది అప్పుడప్పుడు అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కారం, మసాలాలు ఉన్న ఆహారాలను అధికంగా తినడం, వేళ తప్పించి భోజనం చేయడం, టీ, కాఫీలను అతిగా తాగడం, భోజనం ఎక్కువగా తీసుకోవడం వంటి అనేక కారణాల వల్ల అసిడిటీ వస్తుంది. దీంతో ఏం చేయాలో తోచదు. మెడికల్ షాపుకు వెళ్లి మందులను కొని తెచ్చి వేసుకుంటారు. అయితే దీర్ఘకాలంలో ఇలా చేయడం మంచిది కాదు. దీంతో పలు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఇక కొందరికి రోజంతా అసిడిటీ ఉండదు. కానీ ఉదయం పూట మాత్రం అసిడిటీ ఉంటుంది. ఇలాంటి వారు కింద చెప్పిన పలు చిట్కాలను పాటించడం వల్ల అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది.

### నిమ్మరసం..

అసిడిటీ సమస్యను తగ్గించడంలో నిమ్మరసం ఎంతగానో పనిచేస్తుంది. అయితే నిమ్మరసం కూడా యాసిడ్‌ను కలిగి ఉంటుంది కదా.. అని చాలా మంది అనుకుంటారు. కానీ నిజానికి నిమ్మరసాన్ని మనం తాగితే అది మన శరీరంలో చేరాక ఆమ్లత్వాన్ని కోల్పోతుంది. దీంతో మనకు మేలు జరుగుతుంది. కనుక అసిడిటీ సమస్య ఉన్నవారు నిరభ్యంతరంగా నిమ్మరసం తాగవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త నిమ్మరసం కలిపి తాగితే అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అజీర్ణం కూడా తగ్గుతుంది. ఇక ఉదయాన్నే పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో కలబంద రసాన్ని సేవిస్తున్నా కూడా జీర్ణ సమస్యల నుంచి బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరచడంలో కలబంద ఎంతగానో పనిచేస్తుంది. కలబంద రసాన్ని సేవిస్తుంటే అసిడిటీ నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. దీంతోపాటు గ్యాస్, కడుపు ఉబ్బరం కూడా తగ్గుతాయి.

### సోంపు గింజలు..

ఉదయం అసిడిటీ ఎక్కువగా ఉంటే దాన్ని తగ్గించేందుకు సోంపు గింజలు కూడా ఎంతగానో పనిచేస్తాయి. సోంపు గింజలను తీసుకుని నోట్లో వేసుకుని నమిలి తింటుంటే అసిడిటీ తగ్గుతుంది. లేదా సోంపు గింజలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుండవచ్చు. దీంతో కూడా జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. రోజుకు రెండు సార్లు భోజనానికి ముందు అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో సేవించాలి. అల్లం రసం కడుపులో మంటను తగ్గిస్తుంది. పొట్టను ప్రశాంతంగా ఉండేలా చూస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యాన్ని కూడా తగ్గిస్తుంది.

### చల్లని పాలు..

వేడి పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం పెరుగుతుంది. కానీ చల్లని పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం తగ్గుతుంది. దీంతో అసిడిటీ నుంచి బయట పడవచ్చు. కనుక కడుపులో మంటగా ఉన్నప్పుడు వేడి పాలను కాకుండా చల్లని పాలను తాగితే మేలు జరుగుతుంది. కడుపులో రోజంతా మంటగా ఉండేవారు కొబ్బరినీళ్లను తాగుతుండాలి. దీంతో చక్కని ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకులను నేరుగా అలాగే తింటున్నా కూడా కడుపులో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇలా పలు చిట్కాలను పాటించడం వల్ల కడుపులో మంటను తగ్గించుకోవచ్చు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.

# కలబందను అసలు ఎలా తీసుకోవాలి



ఆయుర్వేద ప్రకారం కలబంద ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కలబందలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కలబంద గుజ్జును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. చాలా మంది ప్రస్తుతం కలబందను ఇండ్లలోనే పెంచుతున్నారు. దీంతో మనకు కలబంద ఎప్పుడు కావాలంటే అప్పుడు లభిస్తుంది. ఇక మార్కెట్‌లోనూ కలబంద జ్యూస్‌ను విక్రయిస్తున్నారు. దీన్ని కూడా మనం ఉపయోగించవచ్చు. అయితే కలబంద నిజంగా మనకు ఆరోగ్య ప్రదాయిని అనే చెప్పవచ్చు. కలబంద జ్యూస్‌ను తాగడం లేదా కలబంద గుజ్జును ఉపయోగించడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అందానికి, శిరోజాల సంరక్షణకు కూడా కలబంద ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే దీన్ని ఎలా తీసుకోవాలి అనే విషయం చాలా మందికి తెలియదు.

### ఇలా తీసుకోవాలి..

కలబంద గుజ్జు లేదా జ్యూస్‌ను నేరుగా అలాగే తీసుకోవచ్చు. అయితే కలబంద రుచి కొందరికి నచ్చకపోవచ్చు. ఇది కొందరికి చేదుగా, వగరుగా అనిపిస్తుంది. కనుక అలాంటి వారు తేనెను చేర్చి తీసుకోవచ్చు. అయితే కలబందను అలర్జీలు ఉన్నవారు తీసుకోకూడదు. కలబందను తింటే కొందరికి పడదు. దీంతో వారికి చర్మంపై దురదలు వస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక ఈ సమస్యలు ఎదుర్కొనే వారు కలబందను తినకూడదు. కలబందలో మన శరీరానికి ఉపయోగపడే అనేక ఔషధ గుణాలతోపాటు విటమిన్లు, మినరల్స్ కూడా ఉంటాయి. అందువల్ల కలబందను రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

### రోగ నిరోధక శక్తికి..

కలబందను రోజూ ఒక టీస్పూన్ మోతాదులో జెల్ తినవచ్చు. అదే జ్యూస్ అయితే రోజూ 30 ఎంఎల్ మోతాదులో తాగవచ్చు. కలబందలో విటమిన్లు ఎ, సి, ఇ, పలు రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. కలబందలో ఉండే విటమిన్ ఎ మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే కంటి చూపును మెరుగు పరుస్తుంది. కలబందను రోజూ తీసుకోవడం వల్ల కంటి చూపు పెరిగి కళ్లద్దాలను తీసి పడేస్తారు. ఇక కలబందలో ఉండే విటమిన్ సి మన శరీర ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. తీవ్రమైన వ్యాధులు రాకుండా ఉంటాయి.

### శిరోజాలు, ముఖానికి..

కలబంద మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. కలబందను రోజూ తింటుంటే జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం తగ్గుతాయి. జీర్ణవ్యవస్థలో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కలబంద శిరోజాలు, ముఖానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. దీంతో తయారు చేసే ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లను ఉపయోగించడం వల్ల ముఖం కాంతివంతంగా మారడమే కాదు, శిరోజాలు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. కలబందలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఇలా కలబంద వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## వేలానికి ట్విట్టర్ పాత లోగో.. భారీ ధర పలికిన బ్లూ పిట్ట



ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విటర్ (ప్రస్తుతం ఎక్స్)కు చెందిన ఐకానిక్ లోగో బ్లూకలర్‌లో ఉండే బుల్లి పిట్ట గుర్తుందా..? ఒకప్పుడు ట్విట్టర్ పేరు వినగానే అందరికీ ముందుగా ఈ పిట్ట బొమ్మే గుర్తొచ్చేది. నీలిరంగులో ఉండే ఆ పిట్ట బొమ్మ ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు సదరు పాత ట్విట్టర్ లోగో బ్లూ బర్డ్‌ను వేలం వేశారు. ఈ వేలంలో ట్విట్టర్ పిట్ట భారీ ధర పలికింది. ఆర్ఆర్ ఆక్షన్ అనే సంస్థ నిర్వహించిన తాజా వేలంపాటలో పిట్ట లోగో 35 వేల డాలర్లకు అమ్ముడైంది. అంటే భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.30 లక్షలన్నమాట. వేలంలో దీనిని దక్కించుకున్న వ్యక్తి వివరాలను ఆక్షన్ సంస్థ వెల్లడించలేదు. అమెరికా శాన్‌ఫ్రాన్సిస్కోలోని ట్విట్టర్ హెడ్‌క్వార్టర్ బిల్డింగ్ గోడపై ఇంతకాలం దర్శనమిచ్చిన బ్లూ బర్డ్ లోగో పన్నెండు అడుగుల పొడవు, తొమ్మిది అడుగుల వెడల్పు, 254 కిలోల బరువు ఉండేది. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు. ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత మస్క్ అనేక మార్పులు చేపట్టారు. సంస్థ పేరును ట్విటర్ నుంచి 'ఎక్స్'గా మార్చారు. అదేవిధంగా ట్విట్టర్ పిట్ట స్థానంలోకి '%శ%'ను చేర్చారు. దాదాపు 75 శాతం మంది ఉద్యోగులను తొలగించారు. కంటెంట్ విషయంలోనూ అనేక మార్పులు తీసుకొచ్చారు. ఇప్పుడు.. ఒకప్పటి ట్విట్టర్ విలువైన పాత జ్ఞాపకమైన ఐకానిక్ బ్లూబర్డ్ లోగోను అమ్మేశారు. 2006లో ఏర్పాటైన ట్విట్టర్ లోగోగా పక్షుల కిలకిలరావాలకు గుర్తుగా 'బర్డ్' లోగో ఏర్పాటు చేశారు. వెబ్ సైట్ క్రియేటివ్ బ్లాగ్ కథనం ప్రకారం లైట్ బ్లూ బర్డ్ సింబల్ కోసం అప్పట్లో 15 డాలర్లు చెల్లించి లోగో తయారు చేయించారు.

## 77 వేల పాయింట్ల పైకి సెన్సెక్స్

**భారీగా లాభపడ్డ సూచీలు**




దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదోరోజూ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ సూచీలు కదంతొక్కడంతోపాటు విదేశీ మదుపరులు నిధులు కుమ్మరించడం సూచీలు ఒక్క శాతానికి పైగా ఎగబాకాయి. ఈ ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను రెండు సార్లు తగ్గించే అవకాశాలుండటంతో మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో ఇంట్రాడేలో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మళ్లీ 77 వేల పాయింట్ల మైలురాయిని అధిగమించింది. చివరకు వారాంతం మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 557.45 పాయింట్ల లాభంతో 76,905.51 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ 159.75 పాయింట్లు అందుకొని 23,350.40 వద్ద ముగిసింది. మొత్తంమీద ఈ వారం లాభాలవారంగా నిలిచింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 3,076.60 పాయింట్లు, నిఫ్టీ 953.20 పాయింట్లు లాభపడ్డాయి.

### ఐదు రోజుల్లో 22 లక్షల కోట్లు

స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడుతుండటంతో మదుపరుల లక్షల కోట్ల సంపదను పోగేశారు. గడిచిన ఐదు రోజుల్లో రూ.22 లక్షల కోట్లకు పైగా వీరి సంపద పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిట్కస్టైన కంపెనీల విలువ రూ.22,12,191.12 కోట్లు పెరిగి రూ.4,13,30,624.05 కోట్లకు(4.79 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. గతంలో భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకున్న ఎఫ్ఐఐలు ప్రస్తుతం భారీగా కుమ్మరిస్తుండటం సూచీలు పుంజుకోవడానికి ప్రధాన కారణమని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

## అంతా బాగుంది కానీ అదొక్కటే సమస్య భారత్‌తో సత్సంబంధాలపై ట్రంప్

**అధిక టారిఫ్‌లొక్కటే సమస్య**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



'భారత్‌తో అమెరికాకు మంచి సంబంధాలే ఉన్నాయి. కానీ ఆ దేశంతో నాకున్నది ఒక్కటే సమస్య. అది ప్రపంచంలో అత్యధికంగా టారిఫ్‌లు విధిస్తున్న దేశాల్లో ఒకటి అవడమే' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. వచ్చే నెల ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలుంటాయని ట్రంప్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా వస్తూత్పత్తులపై ఎంత సుంకాలు వేస్తున్నారో.. అంతే సుంకాలు ఆయా దేశాల వస్తూత్పత్తులపై వేస్తామంటున్నారు ట్రంప్. ఈ నేపథ్యంలో స్థానిక బ్రిట్‌బర్ట్ న్యూస్‌కు తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో భారత్‌తో అమెరికాకున్న సంబంధాలపై ట్రంప్ మాట్లాడారు. ఈ క్రమంలోనే గత నెల ప్రధాని నరేంద్ర మోదీతో వైట్‌హౌజ్‌లో జరిగిన సమావేశం గురించి అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులిచ్చారు. ఇక ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడర్ (ఐఎంఈసీ)పై మాట్లాడుతూ.. 'అదో అద్భుతమైన దేశాల కూటమి. వాణిజ్యంలో మనకు హాని కలిగిస్తున్న దేశాలకు ధీటైన జవాబివ్వాలని అవి కలిసి పనిచేస్తున్నాయి. మాకూ వాణిజ్యంలో శక్తివంతమైన భాగస్వామ్య దేశాలున్నాయి' అన్నారు. కానీ ఇకపై అమెరికాకు ఏ భాగస్వాములూ చెడు చేయనివ్వమన్నారు. ఇందులోభాగంగానే భారత్, ఐరోపా దేశాలు అమెరికా నుంచి తమ దేశాల్లోకి దిగుమతి అవుతున్న వస్తూత్పత్తులపై అధికంగా టారిఫ్‌లు వేస్తున్నాయని దుయ్యబట్టారు. గతంలోనూ 'ఇండియా టారిఫ్ కింగ్' అని ట్రంప్ మండిపడ్డ విషయం తెలిసిందే. ప్రధాని మోదీతో కూడా అధిక టారిఫ్‌లపై నేరుగానే ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి విదితమే.

## డయాబెటిస్, ఊబకాయానికి ఔషధం

**మౌంజారో పేరిట మార్కెట్‌లోకి తెచ్చిన ఎలీ లిల్లి**

**2.5 ఎంజీ వయల్ ధర రూ.3,500**




అమెరికాకు చెందిన ఔషధ రంగ దిగ్గజం ఎలీ లిల్లి.. భారతీయ మార్కెట్‌లోకి డయాబెటిస్, బరువు తగ్గే ఔషధాన్ని తీసుకొచ్చింది. దేశీయ డ్రగ్ రెగ్యులేటర్ నుంచి అనుమతులు లభించడంతో 'మౌంజారో' పేరిట ఈ డయాబెటిస్, వెయిట్-లాస్ డ్రగ్‌ను పరిచయం చేసింది. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం 5 ఎంజీ వయల్ ధర రూ.4,375గా, 2.5 ఎంజీ వయల్ ధర రూ.3,500గా ఉంటుంది. కాగా, లిల్లి తయారు చేస్తున్న ఈ ఔషధానికి ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తునే డిమాండ్ ఉన్నది. ఇక మౌంజారో రసాయనిక నామం టిర్జెపటైడ్. అమెరికా, బ్రిటన్, ఐరోపా దేశాల్లో ఇప్పటికే దీన్ని అమ్ముతున్నారు. బ్రిటన్, ఐరోపా దేశాల్లో మౌంజారో పేరుతోనే విక్రయిస్తుండగా, అమెరికాలో మాత్రం జెప్‌బౌండ్ పేరిట మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే భారత్‌కూ దీన్ని తేవాలని లిల్లి ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నది. ఇప్పుడు మార్గం సుగమమైంది. కాగా, భారత్‌లో 10 కోట్లకుపైగా జనాభా టైప్ 2 డయాబెటిస్, ఊబకాయం సమస్యలతో బాధపడుతున్నారు. వీరందరికీ మౌంజారో గొప్ప ఊరట కాగలదన్న ఆశాభావాన్ని లిల్లి ఇండియా అధ్యక్షుడు, జనరల్ మేనేజర్ విన్సెలో టక్కర్ వ్యక్తం చేశారు. మరోవైపు 2030 నాటికి ఈ ఔషధం అమ్మకాలు 150 బిలియన్ డాలర్లకు చేరవచ్చున్న అంచనాలు మార్కెట్ విశ్లేషకుల నుంచి వినిపిస్తుండటం గమనార్హం.

# పోస్టాఫీసు పథకాలతో రాబడి
# గ్యారెంటీ ఆ పథకంలో ఏకంగా 8.2 శాతం వడ్డీ




భారతదేశంలో చాలా ఏళ్లుగా పోస్టాఫీసు పథకాలు ప్రజాదరణ పొందుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలను పొదుపు మార్గం వైపు తీసుకెళ్లడానికి ఈ పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. నెలవారీ చందాలతో నడిచే ఈ పథకాలు గరిష్ట రాబడిని అందిస్తున్నాయి. పౌరుల వయస్సు ఆధారంగా అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోస్టాఫీసు పథకాల్లో ఏయే పథకంలో ఎంత వడ్డీ వస్తుందో? తెలుసుకుందాం. పోస్టాఫీస్ సాధారణ, సీనియర్ సిటిజన్లందరికీ అనేక పొదుపు పథకాలను అందిస్తుంది. సురక్షితమైన పెట్టుబడి ఎంపికలతో పాటు హామీ ఇచ్చే రాబడి కోసం చూస్తున్న పెట్టుబడిదారులు పోస్టాఫీస్ పథకాలను ఎంచుకోవచ్చు. కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), సుకన్య సమృద్ధి ఖాతా (ఎస్ఎస్ఏ), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) వంటి పథకాలు ప్రత్యేక రాబడిని అందిస్తున్నాయి. ఈ పథకాలకు వేర్వేరు పెట్టుబడి ప్రమాణాలు ఉన్నాయి. కనీస పెట్టుబడి అవసరం, వయస్సు, వ్యవధి వంటి పథకానికి అనుగుణంగా మారుతూ ఉంటాయి.

### మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్

పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ అనేది మీరు ఒకేసారి పెట్టుబడి పెట్టాల్సిన పొదుపు పథకం. ఈ పథకంలో సంవత్సరానికి 7.40 శాతం వడ్డీ రేటును పొందవచ్చు. మీరు కేవలం రూ. 100తో మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ ఖాతాను తెరవచ్చు. ఒక ఖాతాలో గరిష్టంగా రూ. 9 లక్షలు, ఉమ్మడి ఖాతాలో రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

### కిసాన్ వికాస్ పత్ర

కిసాన్ వికాస్ పత్ర సంవత్సరానికి 7.5 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1,000గా ఉంది. అలాగే ఈ స్కీమ్‌కు గరిష్ట పరిమితి లేదు.

### సుకన్య సమృద్ధి యోజన

సుకన్య సమృద్ధి యోజన అనేది బాలికల ప్రత్యేక పథకం. ఈ పథకం కింద, ఒక బాలిక తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకులు సంవత్సరానికి గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. ఈ పథకంలో 8.2 శాతం వడ్డీ రేటును పొందవచ్చు.

### సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్

సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ పథకంలో కూడా 8.2 శాతం వడ్డీ రేటును అందిస్తున్నారు. ఈ ఖాతాలో కూడా ఒకే డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఖాతాలో డిపాజిట్ చేయడానికి గరిష్ట పరిమితి రూ. 30 లక్షలు.

### నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సీ) వార్షికంగా చక్రవడ్డీతో కలిపి 7.7 శాతం వడ్డీని అందిస్తుంది. అయితే ఈ స్కీమ్‌లో కనీసం రూ. 1,000 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అయితే పెట్టుబడిపై గరిష్ట పరిమితి లేదు.

### రికరింగ్ డిపాజిట్

పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ కింద మీరు సంవత్సరానికి 6.7 శాతం వడ్డీని పొందవచ్చు. కనీసం రూ. 100 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ స్కీమ్‌లో గరిష్ట పెట్టుబడి పరిమితి లేదు.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)

ఈ పథకంలో ఓ ఆర్థిక సంవత్సరంలో కనీస డిపాజిట్ రూ. 500 నుంచి రూ. 1.5 లక్షల వరకు చేయాల్సి ఉంటుంది. ఈ పథకంలో సంవత్సరానికి 7.1 శాతం వడ్డీ రేటును పొందవచ్చు. అలాగే పీపీఎఫ్‌పై సంపాదించే వడ్డీకి పన్ను ఉండదు. అయితే ఈ స్కీమ్ లాక్-ఇన్ వ్యవధి 15 సంవత్సరాలుగా ఉంది.

### పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ ఖాతా

పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతా వ్యక్తిగత/ఉమ్మడి ఖాతాలపై సంవత్సరానికి 4 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. ఈ ఖాతాను ప్రారంభించడానికి అవసరమైన కనీస మొత్తం రూ. 500గా ఉంటుంది.

# ఎస్ఐపీ చిన్నది లాభాలు పెద్దవి
# వారిని ఆకర్షించేందుకు కోటక్ భారీ ప్లాన్




భారతదేశంలో యువ పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ వంటి పథకాల్లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. గతంలో దీర్ఘకాలికంగా ఆదాయాన్ని స్థిర ఆదాయ పథకాలుగా ఉండే చిన్న మొత్తాల పొదుపుల్లో పెట్టుబడికి ప్రజలు ఆసక్తి చూపే వారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెరగడంతో తక్కువ రిస్క్ ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. ఇలాంటి వారి కోసం ప్రముఖ కంపెనీ కోటక్ మ్యూచువల్ ఫండ్ చోటా సిప్ పేరుతో ఓ కొత్త ఎస్ఐపీను ప్రారంభించింది. కోటక్ మ్యూచువల్ ఫండ్ ఇటీవల "చోటీ సిప్" సౌకర్యాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్‌కు సంబంధించిన అన్ని అర్హత కలిగిన పథకాలకు చోటీ సిప్ అందుబాటులో ఉంటుంది. సెబీ, ఏఎంఎఫ్ఐ ఇటీవల చోటీ సిప్ (స్మాల్ టికెట్ సిప్) ను ప్రవేశపెట్టాయి. సంపద సృష్టి ప్రయాణంలోకి ఎక్కువ మంది భారతీయులను తీసుకురావడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశమని నిపుణులు చెబుతున్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 5.4 కోట్ల మంది ప్రత్యేక పెట్టుబడిదారులు మాత్రమే మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు వారికి మ్యూచువల్ ఫండ్స్‌లో ఆసక్తి కలిగించడానికి ఎస్ఐపీలు ఒక అద్భుతమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కోటక్ ప్రవేశపెట్టిన చోటా ఎస్ఐపీతో కేవలం రూ. 250తో వారి సంపద సృష్టి ప్రయాణాన్ని ప్రారంభించవచ్చని నిపుణులు చెబతున్నారు. కోటక్ మ్యూచువల్ ఫండ్స్ చోటీ ఎస్ఐపీ అధిక రాబడినిచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా చిన్న సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా ఎక్కువ మంది ప్రజలను మ్యూచువల్ ఫండ్స్ వైపు ఆసక్తి చూడంతో ఈ మార్కెట్‌పై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. అయితే కోటక్ చోటీ ఎస్పీలో పెట్టుబడి పెట్టాలంటే పెట్టుబడిదారుడు గతంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టి ఉండకూడదు. అలాగే పెట్టుబడిదారుడు గ్రోత్ ఆప్షన్‌లో పెట్టుబడి పెట్టడంతో పాటు కనీసం 60 వాయిదాలు చెల్లించడానికి సిద్ధంగా ఉండాలి. వాయిదాల చెల్లింపు ఎన్‌ఏసీహెచ్ లేదా యూపీఐ ఆటో-పే ద్వారా మాత్రమే చేయాలి. ఈ ప్లాన్ తమకు అనుకూలంగా ఉందో? లేదో? అనే సందేహం ఉంటే పెట్టుబడిదారులు తమ ఆర్థిక నిపుణులు, పన్ను సలహాదారులను సంప్రదించడం ఉత్తమం. కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ. కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్‌కు అసెట్ మేనేజర్. కేఎంఏఎంసీ డిసెంబర్ 1998లో తన కార్యకలాపాలను ప్రారంభించింది. అలాగే డిసెంబర్ 31, 2024 నాటికి, వివిధ పథకాలలో 70.43 లక్షలకు పైగా ప్రత్యేకమైన ఫోలియోలను కలిగి ఉంది. కేఎంఎఫ్ వివిధ రకాల రిస్క్ %-% రిటర్న్ ప్రొఫైల్‌లతో పెట్టుబడిదారులకు సేవలు అందించే పథకాలను అందిస్తుంది. అలాగే ప్రభుత్వ సెక్యూరిటీలలో మాత్రమే పెట్టుబడి పెట్టే ప్రత్యేక గిల్ట్ పథకాన్ని ప్రారంభించిన దేశంలో మొట్టమొదటి ఫండ్ హౌస్‌గా నిలిచింది. ఈ కంపెనీ 96 నగరాల్లో 104 శాఖలతో విస్తరించి ఉంది.

## వ్యాపారంలో ఆ నియమం పాటిస్తే లాభాల పంట ఆ లక్షణాలు ఉంటే సక్సెస్ సాధ్యం



ఇటీవల కాలంలో యువత లోచనా విధానం మారుతుంది. గతంలో కష్టపడి చదివి మంచి ఉద్యోగంతో స్థిరపడాలని కోరుకునే వారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా ఒకరి కింద పని చేయడం కంటే మంచి వ్యాపారం పెట్టుకుని సక్సెస్ అవుదామనుకునే వారి సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో వ్యాపారంలో ఓ నియమయం పాటిస్తే సక్సెస్ అవుతారని నిపుణులు చెబుతున్నారు. 85 శాతం నియమంగా చెప్పుకునే ఆ టిప్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. ఇటీవల కాలంలో వ్యాపారంలో యువ వ్యాపారవేత్తలు అధికమయ్యారు. వ్యాపారంలో విజయం సాధించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అయితే కష్టేఫలి అనే సూత్రం వ్యాపారులకు సరిపోదని కొంత మంది నిపుణులు చెబుతున్నారు. వ్యాపారం కోసం ప్రతిరోజూ 100% ప్రయత్నం చేయడం వల్ల దీర్ఘకాలిక విజయం కంటే రాబడికి తగ్గే ప్రమాదం ఉందని వాదిస్తున్నారు. ఇటీవల ఓ ప్రముఖ వ్యాపారవేత్త 85 శాతం నియమంగా పిలిచే కొత్త నియమయం సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. వ్యాపారస్తులు అధిక శ్రమను నివారించి, వ్యూహాత్మక, స్థిరమైన ప్రయత్నంపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. సంవత్సరాలుగా నిరంతరం పని చేస్తున్నప్పుడు 100 శాతం ఫలితం కోసం ప్రయత్నించడం వాస్తవానికి ఎదురుదెబ్బ తగలవచ్చని గ్రహించానని, బదులుగా ప్రత్యేక దృష్టితో పాటు వ్యూహాత్మక ప్రాధాన్యతను నేర్చుకునేలా 85 శాత నియమం పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఈ నియమం పాటించే సమయంలో అథ్లెట్ల గురించి ఆలోచిస్తే క్లారిటీ వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అథ్లెట్లు కఠినంగా శిక్షణ పొందుతారు. కానీ ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో? తెలుసుకుని విశ్రాంతి తీసుకోవడంతో సంపూర్ణ ఉత్తమ ప్రదర్శన ఇస్తారని చెబుతున్నారు. వ్యాపారాన్ని నడపడం కూడా ఓ గేమ్ లాంటిదని, కానీ ముందుగా విజయాన్ని చేరుకునే కంటే స్థిరత్వంతో విజయాన్ని చేరుకుంటే ఎక్కువ లాభాలను పొందవచ్చని చెబుతున్నారు. స్టార్టప్‌ను నిర్మించడం ఒక సుదీర్ఘ ప్రయాణమని, ఇది త్వరిత స్ప్రింట్ కాదని చెబుతున్నారు. ప్రతిరోజూ పూర్తి శక్తితో పనిచేయడానికి ప్రయత్నించడం స్థిరమైనది కాదని, ప్రతిరోజూ 80 నుంచి 85 శాతం కృషిని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మనం నిజంగా ముఖ్యమైన విషయాలపై దృష్టి పెట్టవచ్చని వివరిస్తున్నారు. 8 5శాతం నియమం అనేక మంది వ్యాపారస్తులకు నచ్చింది. ఈ మేరకు ఆమె పోస్ట్‌కు రిప్లయ్ ఇస్తున్నారు. అయితే ఈ నియమం ఎక్కువ గంటలు, నిరంతర కృషిని కీర్తించే ప్రబలంగా ఉన్న 'హస్టిల్ సంస్కృతి'ని సవాలు చేస్తుంది. అయితే కంపెనీలు ఈ విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా సమతుల్యత, వ్యూహాత్మక దృష్టి, ఉద్యోగులకు సకాలంలో విశ్రాంతి దొరుకుతాయని నిపుణులు వివరిస్తున్నారు.

## అద్దె ఇల్లు సొంత ఇల్లు ఈ రెండింటిలో ఏది బెస్ట్ నిపుణుల సూచనలు ఏంటంటే




భారతదేశంలోని మధ్య తరగతి ప్రజలకు సొంత ఇల్లు కొనుగోలు చేయడం అనేది ఓ ఎమోషన్. బయట అంతా కష్టపడి సొంత ఇంట్లో సేద తీరాలని ప్రతి ఉద్యోగి అనుకుంటాడు. అందువల్ల రూపాయిరూపాయి కూడబెట్టి మరీ సొంత ఇల్లు కొనుగోలు చేస్తారు. అయితే కొంత మంది మాత్రం లోన్ తీసుకుని నెలనెలా కట్టే అద్దెను ఈఎంఐ రూపంలో కట్టవచ్చునే ఉద్దేశంలో ఇల్లు కొనుగోలు చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఏళ్లుగా ఇల్లు కొనుగోలు చేయడం ఉత్తమమా? అద్దెకు తీసుకోవడం ఉత్తమమా? అనే అనుమానం అందరికీ ఉంటుంది. 2025లో ఇల్లు అద్దెకు తీసుకోవడం, కొనడం మధ్య చర్చ మరింత తీవ్రంగా సాగుతుంది. పెరుగుతున్న ఆస్తి ధరలు, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో ఈ చర్చ తీవ్రమైంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో చోటు చేసుకున్న మార్పులు కారణంగా చాలా మంది నిర్ణయం తీసుకోవడానికి జంకుతున్నారు. ఉన్న సొమ్మంతా కలిపి ఇల్లు కొనుగోలు చేస్తే కొన్నేళ్లకు ఇంటి విలువ కంటే ఆ సొమ్ము డిపాజిట్ చేస్తే వచ్చే రాబడే ఎక్కువగా ఉంటుందని కొంత మంది నిపునులు చెబుతున్నారు. అయితే ఇంటి విలువ పెరుగుదల అనేది మనం కొనుగోలు చేసిన ప్రాంతాన్ని బట్టి ఉంటుందని మరికొంత మంది నిపుణులు చెబుతున్నారు. ఎవరికైనా సొంత ప్రాంతంలో ఇంటిని కొనుగోలు చేయాలని ఉంటుంది. అలా దీర్ఘకాలిక ఆలోచనలు ఉన్న వారు ఇల్లు కొనుగోలు చేస్తే నిర్వహణ, పన్ను ఖర్చులు ఉన్నప్పటికీ ఆస్తిని కొనుగోలు చేయడం అర్థవంతంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అద్దె బదులు ఈఎంఐ చెల్లించవవచ్చని కొనుగోలు ఉత్తమ నిర్ణయం కాదని చెబుతున్నారు. ముఖ్యంగా ఇంటి కొనుగోలుకు అయ్యే డౌన్ పేమెంట్ ఖర్చును కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అదే సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, ప్రభుత్వ సెక్యూరిటీల వంటి ప్రత్యామ్నాయాల ద్వారా 7 శాతం నుంచి 9 శాతం వరకు వడ్డీను సంపాదించవచ్చు. కానీ భారీ ముందస్తు పెట్టుబడి, కొనసాగుతున్న నిర్వహణ ఖర్చులతో పాటు దీర్ఘకాలిక తనఖా నిబద్ధత అవసరం. ఈఎంఐలు అద్దె కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ అవి కాలక్రమేణా ఈక్విటీని నిర్మిస్తాయి. ఆర్థిక భద్రతతో పాటు దీర్ఘకాలిక గృహ ప్రణాళికలు ఉన్నవారికి ఇల్లు కొనుగోలు చేయడమే ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. అయితే మెట్రో నగరాల్లో కొనుగోలు చేయాలనుకునే వారు కాస్త జాగ్రత్తగా ఆలోచించి పెట్టుబడి పెట్టాలని పేర్కొంటున్నారు. అద్దె ధరలు ఏటా పెరుగుతున్నప్పటికీ అద్దెకు తీసుకోవడం వల్ల హెచ్చుతగ్గుల రియల్ ఎస్టేట్ విలువలు, మార్కెట్ తిరోగమనాల ప్రమాదాలు నివారిస్తుంది. ఇంటి కొనుగోలు నిర్ణయం అనేది వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలు, స్థిరత్వం, మార్కెట్ డైనమిక్స్‌పై ఆధారపడి తీసుకోవాల్సి ఉంటుంది.

